నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
బుధవారం | మే15 , 2024 | www.navatelangana.com

పిడుగుపాటుకు ఒకరు మృతి



- ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ- త్రిపురారం

నల్గొండ జిల్లాత్రిపురారం మండలం నీలయాయి గూడెంలో పిడుగు పడియువకుడు మృతి చెందగా, మరొక ఇద్దరికీ గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. మధ్యాహ్న సమయంలో ఒక్క సారి గా వాతా తావరణం మారి ఉరుములు, గాలి దుమారం చెలరేగింది. నీలాయి గూడెం గ్రామం లో కొందరు యువకులు పొలాల్లో క్రికెట్ ఆడుతున్న సమయంలో కొద్ది పాటి జల్లు రావడంతో చెట్టు కిందకు వెళ్లిగా ఒక్క సారి పిడుగు వారి మీద పడింది. ఈ పిడుగు పాటుకి మర్రి రుషి (20) అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునిది నల్గొండ మండలం వెలుగుపల్లి కాగా నీలాయిగూడెం అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. మరొక ఇద్దరికి గాయాలు కావడం తో మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారు చాగంటి సిద్దు , దైవం ప్రదీప్‌లకు ప్రమాదం తప్పింది.

ప్రమాద బాధితునికి పరామర్శ

నవతెలంగాణ- నకిరేకల్



నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మెరుగు నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు .

ప్రజా తీర్పు నిక్షిప్తం

- ఈవీఎంలలో భద్రంగా భవితవ్యం
- ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన అధికారులు
- సీఆర్పీఎఫ్ నీడలో గోదాములు
- ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ ల సీజ్

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

జిల్లా లోక్ సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటరు తీర్పు ఈవీఎంలో నిక్షిప్తమైంది. పార్లమెంటు ఎన్నికల పోలింగ్ లో పోలైన ఈవీఎంలను నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి గోదాంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ల లో భద్రపరిచారు. నల్గొండ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి వచ్చే దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్నగర్, కోదాడ, సూర్యాపేట, నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలన్నింటిని అనుశెట్టి దుప్పలపల్లి గోదాంలో ఆయా నియోజకవర్గాల వారిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా సాధారణ పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశీ సమక్షంలో, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు హాజరుకాగా, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి చందన, ఎస్పీ చందన దీప్తి ఆధ్వర్యంలో ఈవీఎంలను భద్రపరిచారు.



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములతో పాటు, దుప్పలపల్లి గోదాం మొత్తం పూర్తిగా సీఆర్పీఎఫ్ భద్రత, పోలీస్ భద్రతలో ఉంది. సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా అసెంబ్లీ నియోజక వర్గాల వారిగా ఈవీఎంలు అన్ని దుప్పలపల్లి గోదాంకు చేరుకోగా వాటన్నిటినీ స్ట్రాంగ్ రూములలో ఉంచి ఎన్నికల పరిశీలకుల సమక్షంలో వాటికి సీల్ చేసారు. సీజ్ చేసే సమయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తో పాటు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నల్గొండ,సూర్యాపేట జిల్లాల ఆర్డీవోలు , అడిషనల్ ఎస్పి రాములు, జిల్లా రెవెన్యూ అధికారి డి. రాజ్యలక్ష్మి, పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు,డీఆర్డీఓ నాగిరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు సంగీతలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూమన్న డీఎస్పీ శివరామిరెడ్డి, జిల్లా అధికారులు, ఎలక్షన్ విభాగం సూపరింటిండెంట్ విజయ్, చంద్ర వదన, తహసిల్దారులు, తదితరులతో పాటు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి శంకర్ నాయక్, బీఆర్ఎస్ నుండి పంకజ్ యాదవ్, బీజేపీ నుండి నూకల నరసింహారెడ్డి, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు గోలి సైదులు, చోలేటి ప్రభాకర్, సిరిశాల సీనయ్య, స్వతంత్ర అభ్యర్థుల తరఫున వారి ప్రతినిధులు యాదగిరి, నరసింహ తదితరులు ఉన్నారు.

మల్లన్న గొంతు చట్టసభలో వినిపించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నవతెలంగాణ- నకిరేకల్

తీన్మార్ మల్లన్న గొంతు చట్టసభలో వినిపిస్తే అది సామాన్యుల వాయిస్ అని, నీతివైపు, ధర్మం వైపు మాట్లాడే గొంతుకను చట్టసభలలో ఉంచాల్సిన అవసరం అందరిపై ఉందని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉంటున్న తీన్మార్ మల్లన్న గెలిపించుకోవాలన్నారు. తెలంగాణలో ఉన్న నియంతృత్వ పాలనను గద్దె దించే వరకు ఎన్ని ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయకుండా, ఎన్నిసార్లు జైలుకెళ్లిన మనోధైర్యం కోల్పోకుండా తెలంగాణ ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా పెట్టి ఆ దొరకు తలవంచకుండా దొరను గద్దె దించడమే లక్ష్యంగా కొట్లాడిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అని కొనియాడారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ రెండు కలిసిపోయాయన్న సత్యం తెలంగాణ ప్రజలు తెలుసుకున్నారన్నారు. ఈ రెండు పార్టీలు వేరు కాదని నిన్న జరిగిన ఎన్నికలలో తేలిపోయిందన్నారు. రేపు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఈ రెండు పార్టీలు ఒకటయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. అందరూ కలిసి మల్లన్న ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు.

అమ్మ ,అయ్య మీద ఒట్టేసి చెబుతున్నా.. మీ ఓటు వృథా కానివ్వను : అభ్యర్థి తీన్మార్ మల్లన్న

అమ్మ ,అయ్య మీద ఒట్టేసి చెబుతున్నా.. ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపిస్తే మీ ఓటు వృథా కానివ్వకుండా మీ పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం కొట్లాడుతానానరు. దేశ రాజకీయాలలో తన కుటుంబ ఆస్తులను ప్రభుత్వానికి ఇచ్చి ఎన్నికలలో పోటీ చేసిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే లేరనే చెబుతారు. కానీ మీ తీన్మార్ మల్లన్న మాత్రం ఆస్తులను ప్రభుత్వానికి అప్పగించి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తుండని తెలిపారు. తాను ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత అన్ని ఉద్యోగ సంఘాల నాయకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరికి తోల్కపోతానని వారి సమస్యలు వినిపిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టబద్రులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యార్థుల జయకేతనం

- ఇంటర్, పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభ
- గణితం, తెలుగులో వంద మార్కులు సాధించిన విద్యార్థులు



నవతెలంగాణ -పెద్దవూర

2023-24 సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయ చలకుర్తి క్యాంప్‌నందున్న 10వ తరగతి విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జయకేతనం ఎగురవేశారు 80 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూఉత్తీర్ణులయ్యారు. కృష్ణ ప్రసాద్ అన్ని సబ్జెక్ట్ లో 90 కన్నా ఎక్కువ మార్కులు సాధించి మొత్తం మీద 97 శాతం తో మొదటి ర్యాంక్ లో నిలిచాడు. పంతగాని అఖిలేష్ 96 మార్కులు సాధించి రెండో ర్యాంకులో నిలిచాడు. బుర్ర సుశీల 95 మార్కులు సాధించి మూడో ర్యాంకులో నిలిచారు.ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో ఇద్దరు స్టూడెంట్స్ 95 మార్కులు, తెలుగులో 08 మంది విద్యార్థులు 99,సాంఘిక శాస్త్రంలో ఇద్దరికీ విద్యార్థులు 99, తెలుగులో ముగ్గురు విద్యార్థులు 100 కు 100, గణితం లో నలుగురు 98 మార్కులు సాదించి అత్యుత్తమ ప్రతిభ చాటారు.అలాగే ఇంటర్ సెకండియర్ లో 28 మంది విద్యార్థులకు గాను 28 మంది పాసయ్యారు. ఆలేటి స్టాలిన్ 91 శాతం మార్కులు సాధించి విద్యాలయంలో మొదటి ర్యాంక్ లో నిలిచారు.రమావత్ మహేందర్ 90శాతం సాధించి రెండో ర్యాంకు, ఎలుక కౌశిక్ 85 శాతం మార్కులతో మూడో ర్యాంకు,ఇంగ్లీషు,కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీలో 96 మార్కులు సాధించి అత్యున్నత ప్రతిభ కనబరిచారు.అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు.



బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి

- రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ- మిర్యాలగూడ

పట్టణంలోని బాపూజీ నగర్‌లో సోమవారం అర్ధరాత్రి బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు.బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ ముఖ్య కార్యకర్తలు దుర్గాచారి, శ్యామ్, క్రాంతి,జనార్ధన్,శ్రీనివాస్‌ల ఇండ్లపై మారణాయుధాలతో (కొడవలి, ఐరన్ రాడ్ కర్రలతో) దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో దుర్గచారి బొటనవేలు ఫ్రాక్చర్ అయ్యిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాథమిక వైద్యం చేసి అనంతరం స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించారు గాయపడిన జనార్ధన్, శ్యామ్ లను ఇంటికి పంపారని, ఇంటికి వెళ్లిన వారిని తీవ్ర దుర్భాషలతో దూషిస్తూ గేట్, ప్రహరీ గోడ కూల్చి విచక్షణ రహితంగా కొట్టారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ ప్రాణాలు కాపాడాలని కోరారు.

బీఆర్ఎస్‌కు కంచుకోట 'మిర్యాలగూడ'

- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం : నల్లమోతు సిద్దార్థ

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని యువనేత, ఎన్బీఆర్ ఫౌండేషన్ చైర్మెన్ నల్లమోతు సిద్దార్థ అభివర్ణించారు. తమ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత నల్లమోతు భాస్కర్ రావుకే దక్కుతుందన్నారు. నల్లగొండ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణా రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన బీఆర్ఎస్ క్యాడర్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ లో తెలంగాణ గళాన్ని వినిపించాలంటే బీఆర్ఎస్ పార్టీ ప్రాతినిథ్యం తప్పనిసరి అని అన్నారు. కంచర్ల కృష్ణా రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచి ప్రచారం ముగిసే తేదీ నాటికి బీఆర్ఎస్ శ్రేణులు మిర్యాలగూడ నియోజకవర్గంలోని గడపగడపకు వెళ్లి కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాయన్నారు. నమూనా బ్యాలెట్ పేపర్‌ను కార్యకర్తలు ప్రదర్శించి అవగాహన కల్పించారని తెలిపారు. బీఆర్ఎస్ క్యాడర్ లో జోష్ నింపేందుకు గులాబీ దళపతి కేసీఆర్ శ్రీకారం చుట్టిన పోరుబాట కార్యక్రమం, రోడ్డు షో మిర్యాలగూడ నియోజకవర్గం నుంచే ప్రారంభం కావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మిర్యాలగూడ లో కేసీఆర్ చేపట్టిన రోడ్డు షో గులాబీ శ్రేణుల్లో నయా జోష్ నింపిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుతమైన పోరాటపటిమ ప్రదర్శించిన భారత రాష్ట్ర సమితి శ్రేణులు అందరికీ, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత తిరిగి బలంగా నిలబడి కొట్లాడడం ఆషామాసీ వ్యవహారం కాదని.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుతమైన నిబద్ధతతో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ వెంట నడిచి, ఎన్నికల్లో ప్రజామోదం కోసం కొట్లాడిన తీరు అద్భుతమన్నారు. గత రెండు మూడు నెలలుగా సామాజిక మాధ్యమాల్లో పార్టీ కోసం పని చేసిన, ప్రతి ఒక్క సోషల్ మీడియా వారియర్స్‌కి ఈ సందర్భంగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ మీద ఉన్న ప్రేమ, కేసీఆర్‌పై ఉన్న అచంచలమైన విశ్వాసంతో పార్టీ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో తమ వాణిని బలంగా వినిపించి, అద్భుతంగా కొట్లాడారన్నారు. తమ పార్టీ శ్రేణులు చేసిన ఈ పోరాటం గొప్ప ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

- టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ డిమాండ్



నవతెలంగాణ - నాంపల్లి

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనలప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ మంగళవారం స్థానికంగా ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిలివేరు నారాయణ, జంపాల అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీఓ, ఏపీఓలకు రోజుకు రూ 600, ఓపీఓలకు రూ 400 రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం. 61 ని ఈ నెల 11 న విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీఓ, ఏపీఓలకు రూ 3150 లు చెల్లించగా, నారాయణఖేడ్ లో 2400 మాత్రమే ఇచ్చారని, ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని తెలిపారు .నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కామినేని దంత కళాశాలలో.. వినూత్న ఆవిష్కరణ

- విరిగిన దిగువ దవడ ఫిక్సేషన్ ప్లేట్ అరుదైన చికిత్స

నవతెలంగాణ - నార్కట్‌పల్లి

విరిగిన దిగువ దవడ ఫిక్సేషన్ ప్లేట్‌కు ప్రత్యేకమైన ట్రీట్మెంట్ విధానాన్ని కామినేని దంతా వైద్య కళాశాలలో ఓరల్ అండ్ మాక్సిల్లోఫేషియల్ సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ వి. విద్యా దేవి ప్రవేశ పెట్టగలిగారు. ఈ అరుదైన చికిత్స ఒక అద్భుతమైన రూపకల్పన చేసి దానికి పేటెంట్స్ రిజిస్ట్రేషన్ సాధించి కళాశాలకు గర్వకారణం చేకూర్చారు. ఈ విధమైన సర్టిఫికెట్ పొందడం చాలా అరుదైన విషయం. ఈ పేటెంట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి ఐపిఆర్ సంస్థ ద్వారా ఈనెల 10న సర్టిఫికెట్ సాధించి రీసెర్చ్ విభాగంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాదేవిని మంగళవారం యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ డిపార్ట్మెంట్ అధిపతి డాక్టర్ బి. పావన్ కుమార్ , ప్రిన్సిపాల్ డాక్టర్ పి. మహేష్ మద్దతుతో ఈ ప్రాజెక్ట్ సాధించానని తెలిపారు ఈ ప్రయోగం వలన విరిగిన దిగువ దవడ ఫిక్సేషన్ ప్లేట్ కు ప్రత్యేకమైన ట్రీట్మెంట్ విధానాన్ని ప్రవేశ పెట్టగలిగారు. కళాశాల విద్యార్థులు పీజీ స్టూడెంట్స్ అండ్ ఫ్యాకల్టీ డాక్టర్ విద్యను అభినందించారు.





ఎవరి ధీమా వారిదే

- లెక్కల్లో అభ్యర్థులు
- 2019 కంటే పెరిగిన పోలింగ్ శాతం
- రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- ఈవీఎం లలో భద్రంగా అభ్యర్థుల భవితవ్యం

నల్లగొండ లోక్ సభ పోలింగ్ సోమవారం ముగిసింది .నువ్వా నేనా అన్నట్లు సాగిన త్రిముఖ పోరులో విజయం ఎవరిదనే చర్చ అన్ని పార్టీల్లో మొదలైంది. బూతుల వారీగా తమకు లభించిన ఓట్లపై ఆరా తీస్తున్నారు .ఎవరికి వారుగా విశ్లేషణల్లో మునిగిపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో వలస ఓటర్లపై పార్టీలు అంత దృష్టి పెట్టలేకపోయాయి .వలస పోయిన ఓటర్లను రప్పించాలంటే ఖర్చుతో కూడుకున్న పని కావడంతో ఆయా పార్టీలు అంతగా ఆసక్తి చూపలేదు. స్థానిక ఓటర్ల పైనే ఆధారపడ్డారు. దీంతో పోలింగ్ శాతం పడిపోయింది .కాంగ్రెస్, బీఆర్ఎస్ , బీజేపీ పార్టీలు ఫలితాల పట్ల ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



నవతెలంగాణ- దేవరకొండ

సోమవారం జరిగిన నల్లగొండ పార్లమెంటు ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గంలో 70.60 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గం లో 2,62,480 మంది ఓటర్లలో పురుషులు1,31, 838, మహిళలు1,30,624, థర్డ్ జెండర్18 మంది ఓటర్లు ఉన్నారు. 328 పోలింగ్ కేంద్రాలలో1,85,310 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 94,826, మహిళలు 90,405, ఇతరులు 9 మంది ఉన్నారు .2019 నల్లగొండ లోక్ సభ ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గం లో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల కంటే 2 శాతం పెరిగింది. కానీ 2023 డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో85.10 శాతం పోలింగ్ నమోదైంది. 5నెలల క్రితం జరిగిన ఎన్నికలకు సోమవారం జరిగిన ఎన్నికల ఓటింగ్ శాతాన్ని బట్టి చూస్తే15.50 శాతం తగ్గింది. ఎండ వేడిమి అధికంగా ఉండడంతో ఎన్నికల కమిషన్ పోలింగ్ తుది గడువు సాయంత్రం 6 గంటల వరకు అనుమతించింది. దీంతో 6 గంటలలోపు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిన అందరికీ ఓటు వేసే అవకాశం ఉండడంతో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మరికొన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు రాకపోవడంతో మధ్యాహ్నం వరకే పోలింగ్ ఆగిపోయింది. నియోజకవర్గంలో చింతపల్లి మండలం జరుపుల తండా37 పోలింగ్ కేంద్రంలో96 శాతం అత్యధికంగా పోలింగ్ నమోదైంది. కొండమల్లేపల్లి మండలం హరియా తండా136 / బి పోలింగ్ కేంద్రంలో22 శాతంతో అతి తక్కువ పోలింగ్ నమోదైంది.138 మంది ఓటర్లు ఉండగా31 మంది ఓటును వినియోగించుకున్నారు . గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ లో ఉన్న ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఎమ్మెల్యే నేనా వత్ బాలు నాయక్ కు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పార్లమెంట్ ఎన్నికలలో అత్యధిక మెజార్టీని సాధించిన రావి నారాయణరెడ్డి టార్గెట్ దాటి రఘువీరారెడ్డి గెలిపించాలని లక్ష్యంతో నల్లగొండ పార్లమెంటు ఎన్నికల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘువీరారెడ్డి జానారెడ్డి కుమారుడు కావడం, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బీఆర్ ఎస్ పార్టీ పై మౌనంగా ఉండడం నియోజకవర్గంలో వ్యక్తిగత పరిచయాలతోనూ క్రాస్ ఓటింగ్ కూడా జరిగే అవకాశాలు ఉన్నాయి. వీలైనంతవరకు బీఆర్ఎస్ ఓటింగును జానారెడ్డి తమ వైపుకు తిప్పుకున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ వైఫల్యాలు, కేంద్రంలో బీజేపీతెలంగాణకు ఏమి చేయడం లేదన్న అంశాలే ప్రధాన అజెండాగా బీఆర్ఎస్ ఎన్నికల లో ప్రచారం నిర్వహించింది. బీఆర్ఎస్ కు ఓటింగ్ శాతం ఏ మాత్రం తగ్గలేదని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంతో నియోజకవర్గంలో 7 మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మెన్ ,మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళిపోయినప్పటికీ గ్రామస్థాయి కార్యకర్తలు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికలు వచ్చిన ఓట్ల కంటే ఎక్కువగా వస్తాయన్న ధీమాలో ఆ పార్టీ ఉంది. కేసీఆర్ కు ప్రజల్లో ఆదరణ తగ్గలేదని గ్రామాలలో బాగా పట్టు ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికలలో గెలవకపోయినా డిపాజిట్ దక్కించుకుంటామని ధీమాలో బీజేపీ ఉంది. నల్గొండ పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో లక్ష మెజార్టీ కాంగ్రెస్ లక్ష్యం బీఆర్ఎస్, బీజేపీ పార్టీ గెలుపు నెరవేరాలంటే జూన్ 4 తేదీ వరకు వేచి చూడాల్సిందే.

దేవరకొండ నియోజకవర్గం లో అత్యధిక మెజార్టీ సాధిస్తామని, గత అసెంబ్లీ ఎన్నికలలో 30 వేలకు పైగా వచ్చిన మెజార్టీ కంటే నల్గొండ లోక్ సభ ఎన్నికలలో దేవరకొండ నియోజకవర్గం లో మూడింతలు మెజార్టీ సాధిస్తామని కాంగ్రెస్ ధీమాలో ఉంది. తాము గెలుపు ఖాయమని, లక్ష మెజార్టీ లక్ష్యంతో ఉన్నట్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో లక్ష మెజార్టీ సాధిస్తే

పిడుగుపాటుకు గేదె మృతి

నవతెలంగాణ-కోదాడరూరల్



పిడుగుపడి గేదె మృతి చెందిన సంఘటన అనంతగిరి మండలపరిధిలోని త్రిపురవరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి అనంతగిరి మండలపరిధిలోని త్రిపురవరం గ్రామానికి చెందిన రైతు మాదాసు నాగుల్‌పాడి గేదె వ్యవసాయభూమిలో మేస్తుండగా పిడుగుపడి మృతి చెందింది.గేదె మృతితో రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.తనను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఎన్నికల నిర్వహణలో సహకరించిన జిల్లా ప్రజలకు అభినందనలు

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరగడం పట్ల కలెక్టర్ ఎస్ వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు.పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుండి మే 13వ తేదీ వరకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ సహకారాలు, వారి భాగస్వామ్యం మరవలేనిదన్నారు.ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా ,నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కర్ని కలెక్టర్ అభినందించారు.ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు.పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగినవి, ఎండలు తీవ్రంగా ఉన్నా కూడా ఎండను లెక్కచేయకుండా ఓటు హక్కు వినియోగించుకోవడంలో చైతన్యం చాటారన్నారు. తమ పూర్తి సహకారాన్ని అందించినందుకు పాత్రికేయులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పోలింగ్ సరళిపై లెక్కలు కడుతున్న అభ్యర్థులు, పార్టీలు

- కూడికలు తీసివేతలలో నిమగ్నం
- గెలుపుపై ఎవరి దీమా వారిదే
- పోలింగ్ తగ్గడంపై నేతల్లో తర్జనభర్జన
- జిల్లాలో ఉత్కంఠ

నవతెలంగాణ-సూర్యాపేట

లోక్‌సభ ఎన్నికలలో జరిగిన పోలింగ్ సరళిపై అభ్యర్థులు,ప్రధాన పార్టీల నేతలు దృష్టిసారించారు.మూడు వారాలుగా అలుపెరుగని ప్రచారం అనంతరం సోమవారం జరిగిన పోలింగ్‌తో లోక్ సభ ఎన్నికలు ముగిసిన విషయం విధితమే.ఈ క్రమంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీలల అభ్యర్థులతో పాటు నాయకులు ఓటింగ్‌పై లెక్కలు కడుతున్నారు.తమకు ఏ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పడతాయనే దానిపై విశ్లేషిస్తున్నారు.ఈ రకంగా పోలింగ్ సరళి అభ్యర్థులతో పాటు ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు,ఇన్‌చార్జిలలో టెన్షన్ పెంచుతుంది. ఈ క్రమంలోనే అభ్యర్థులు కూడికలు, తీసివేతలతో బిజీబిజీగా గడుపుతున్నారు. ఇదిగాక గతంలో కంటే ఈసారి జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని 4 శాసనసభ నియోజకవర్గాలలో పోలింగ్ శాతం తగ్గింది. జిల్లాలో దాదాపు 1,000,012 లక్షల మంది ఓటర్లు వున్నారు. ఇందులో జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలకు గాను 7,46,163 ఓట్లు పోల్ కావడంతో జిల్లాలో 74.61 శాతం నమోదు అయ్యింది.కాగా 2019 లోక్ సభ ఎన్నికల్లో జిల్లాలో 75. 66 శాతం ఓటింగ్ నమోదైన విషయం తెల్సిందే.కాగా ఒక శాతం మాత్రమే ఓటింగ్ శాతం తగ్గింది. ఇదిలావుండగా గత డిసెంబర్లో జరిగిన శాసనసభ ఎన్నికలలో జిల్లావ్యాప్తంగా 86. 55శాతం ఓటింగ్ నమోదు కాగా ప్రస్తుతం జరిగిన లోక్‌సభ ఎన్నికలకు మాత్రం 74.61 శాతం మాత్రమే ఓటింగ్ జరగడం గమనార్హం. దీంతో గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలలో దాదాపుగా 12 శాతం ఓటింగ్ తగ్గింది. ఓటింగ్ శాతం తగ్గడంతో ఈ ప్రభావం ఏ అభ్యర్థిపై పడనున్నదోననే టెన్షన్ అభ్యర్థులతో పాటు పార్టీలలో నెలకొంది. సూర్యాపేట నియోజకవర్గంలో మొత్తం 244,116 ఓటర్లు ఉండగా అందులో 178214 ఓట్లు పోల్ కాగా 73.00 శాతం నమోదైంది. కాగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 73.29 శాతం పోలింగ్ నమోదైంది.దీంతో ఇక్కడ కేవలం 0.29 పర్సెంట్ ఓట్లు మాత్రమే పెరిగాయి.అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గంలో మొత్తం 259,265 ఓట్లు ఉండగా 191845 ఓట్లు పోల్ కాగా 74.00 శాతం నమోదు అయింది. ఇందులో గత అసెంబ్లీ ఎన్నికల్లో 72.38 శాతం నమోదైన విషయం తెలిసిందే.కాగా ఇక్కడ 1.58 శాతం ఓటింగ్ పెరిగింది. అదేవిధంగా కోదాడలో మొత్తం 245,187 ఓట్లు ఉండగా 184261 ఓట్లు పోల్ కాగా 75.15 శాతం నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇక్కడ 78.11 శాతంగా నమోదైంది. పోలింగ్ 3 శాతం తగ్గింది. అదేవిధంగా హుజూర్నగర్ లో మొత్తం 251,444 ఓట్లకు గాను 191843 ఓట్లు పోల్ కాగా 76.30 శాతం నమోదైంది. ఇందులో అసెంబ్లీలో 85.96 శాతం ఉండగా లోక్సభ ఎన్నికల్లో మాత్రం 76.30తో 8 శాతం పోలింగ్ తగ్గింది.దీంతో జిల్లావ్యాప్తంగా గత డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలలో జిల్లావ్యాప్తంగా 86. 55శాతం ఓటింగ్ నమోదు కాగా ప్రస్తుతం జరిగిన లోక్‌సభ ఎన్నికలకు మాత్రం 74.61 శాతం మాత్రమే ఓటింగ్ జరగడం గమనార్హం.ఈ క్రమంలో జిల్లాలో మెజార్టీ పట్టణాలు, గ్రామాలలో పోలింగు భారీగా తగ్గింది.దీంతో పట్టణంలో భారీగా ఓట్లు తగ్గడంతో అవి ఏ పార్టీ వైపు పడ్డాయనే ఆందోళన అభ్యర్థులో నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డి, బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి నియోజకవర్గాలలో పోలైన ఓట్లపై సమీక్షలు జరుపుతున్నారు. ఎక్కడెక్కడ తమకు ఓట్లు పడ్డాయనే దానిపై





విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో గెలుపోటములను శాసించే పట్టణ ఓటర్లపైనే అభ్యర్థులు ఆశతో వున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ మాత్రం నల్గొండ పార్లమెంట్ పరిధిలో ఓటర్లకు 500 నుండి 300 రూపాయల వరకు తాయిలాలు అందించినట్లు ప్రచారం నడుస్తోంది. ఒకరకంగా కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అనే రీతిలో పోటీ నడిచింది. ప్రధానంగా పోలింగ్ ప్రారంభం నుండి ఒంటి గంట వరకు పోలింగ్ మందకొడిగా నడిచినప్పటికీ ఓటు ఎవరికి పడ్డాయో తెలియని సందిగ్ధత నెలకొంది. ఈ క్రమంలో ఉదయం పూట పలు పార్టీలకు ఓట్లు మందగించాయనే చర్చ నడిచింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన తాయిలాలు కొంత మంది ఓటర్లకు అందకపోవడంతో మధ్యాహ్నం వరకు వాటి కోసం ఎదురు చూసిన వారంతా రెండు గంటల తర్వాత ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు భారీగా చేరుకున్నారు. నియోజకవర్గాలలో కూడా అభ్యర్థుల గెలుపోటములపై రకరకాలుగా అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రధానంగా ముగ్గురు అభ్యర్థుల మధ్యే పోరు నడిచిందని వీరిలో ఎవరో ఒకరు గెలుస్తారనే చర్చ సాగుతుంది. మరికొంత మంది మాత్రం కాంగ్రెస్,బీజేపీ పార్టీల మధ్యనే పోటీ ఉందని వీరిలో పట్టణంలో ఎవరికి ఎక్కువగా ఓట్లు పడతాయో వారే విజేత అని పలు కూడళ్లలో చర్చించు కుంటున్నారు.ఈ నేపథ్యంలో పట్టణ కేంద్రాలలో ఎవరికి ఓట్లు పడ్డాయనే దానిపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీలో మాత్రం అధికంగా తమకే ఓట్లు పడ్డాయని గెలుపు ధీమాలో ఎవరికి వారు ఉన్నారు.కాగా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం మెజారిటీ మంది కాంగ్రెస్ వైపే మొగ్గు చూపినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇదిలావుండగా సూర్యాపేటలో మాత్రం బీఆర్ఎస్‌కు చెందిన కొందరు సైలెంట్‌గా బీజేపీకి క్రాస్‌ఓటింగ్ చేసినట్లు జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది.మరి ఓటర్లు మాత్రం ఎవరికి పట్టం కట్టనున్నారోననేది ఈవీఎంలో నిక్షిప్తమైంది. జూన్ 4 వ తేదీన ఓట్ల లెక్కింపు తో నల్గొండ పార్లమెంట్ బాదుషా ఎవరనేది తేలనున్నది.

జహంగీర్‌కు ఓటేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ

నవతెలంగాణ-సూర్యాపేట

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి యండి జహంగీర్‌కు ఓటు వేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ అన్నారు.మంగళవారం స్థానిక మల్లు వెంకట నర్సింహారెడ్డి భవన్‌లో ఆమె ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర,జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులకు, కార్యకర్తలకు, పార్టీసభ్యులకు, కళాకారులకు ధన్యవాదాలు తెలియజేశారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఎండి జహంగీర్ ఓడినా, గెలిచినా ప్రజలకోసం నీతిగా,నిజాయితీగా పనిచేస్తాడన్నారు.ఎన్నికల్లో సహకరించిన ఎన్నికల అధికారులకు, పోలీస్‌సిబ్బందికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టియాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్లవెంకటేశ్వరరావు,కోటగోపి, చెరుకు ఏకలక్ష్మి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, చెరుకు సత్యం, వజ్జె శ్రీనివాస్, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, కల్లేపల్లి భాస్కర్, కడెంకుమార్ పాల్గొన్నారు.



బహుజనులంతా మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

బహుజనులంతా ఏకమై మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించి మారోజు వీరన్న ఆశయాలను కొనసాగించాలని బహుజన కమ్యూనిస్టు రాష్ట్ర కార్యదర్శి కే.పర్వతాలు పిలుపునిచ్చారు. మారోజు వీరన్న 25వ వర్ధంతి సందర్భంగా ఈనెల 16 నుంచి30 వరకు గ్రామగ్రామాన నిర్వహించే సభలను విజయవంతం చేయాలని మంగళవారం స్థానిక రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. మేమెంతమంది మాకంతా వాటా అణగారిన కులాలందది అదే బాట అంటూ మూడుదశాబ్దాల కిందటే మారోజు వీరన్న పోరాటం కొనసాగించాడన్నారు. కులగనన తప్పనిసరి అని చెప్పిన రాజకీయఅంశాలు వర్తమానరాజకీయాలలో అజెండాగా ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో బహుజనకార్మిక సంఘాల రాష్ట్ర ప్రధానకార్యదర్శి గాదల శ్రీనివాస్, బాణాల విజయ్‌కుమార్, బహుజన మహాసభ ఉపాధ్యక్షులు మంద్రమల్లయ్య, బహుజన మహాసభ జిల్లా అధ్యక్షులు బత్తుల వెంకన్న, రాష్ట్ర నాయకులు నారగోని వెంకట్‌యాదవ్, బాణాల విజయ్,బహుజన మహాసభ ప్రధాన కార్యదర్శి బుడిగం మల్లేష్‌యాదవ్, కూలిరాయిసంఘం జిల్లా నాయకులు బొల్లం లింగయ్య, లంబాడీహక్కులపోరాటసమితి రాష్ట్రనాయకులు అమ్మనాయక్,సీపీయూఎస్ఐఆర్ఎం ఆర్గనైజింగ్ సెక్రెటరీ చామకూరినర్సయ్య పాల్గొన్నారు.



'పాలకులు, అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి'

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

ఇకనుండి పాలకులు,అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు.మంగళవారం విక్రంభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెండునెలల నుండి ఎన్నికల హడావుడిలో ఉండి అధికారులు,పాలకులు ప్రజాసమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు.దీంతో ప్రజలు ఇబ్బం దులు పడ్డారన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు లింగన్న పార్టీ నాయకులు శేషగిరి, భిక్షం,మీరా తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గపరిధిలో 76.30 శాతం పోలింగ్

నవతెలంగాణ-హుజూర్‌నగర్

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గపరిధిలోని హుజూర్‌నగర్ అసెంబ్లీ పరిధిలోని ఏడుమండలాల్లో 76.30శాతం పోలింగ్ నమోదైంది.మొత్తం ఓటర్లు 2514 44 మంది ఓటర్లుఉండగా 191843 ఓటర్లు ఓటు హక్కును వినియో గించుకున్నారు. నియోజకవర్గపరిధిలోని నేరేడుచర్ల మండలంలో 35818 మంది ఓటర్లు ఉండగా 25162 ఓటు హక్కును వినియో గించుకున్నారు. పోలింగ్‌శాతం 70.25 పాలకవీడు మండలపరిధిలో 21144 ఓటర్లు ఉండగా 16819 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 79.55శాతంగా నమోదైంది.మఠంపల్లి మండల పరిధిలో 37373 ఓటర్లు ఉండగా 29963 ఓటు హక్కును వినియోగించుకున్నారు 80. 17శాతం నమోదైంది. మేళ్లచెర్వు మండల పరిధిలో 33878 ఓటర్లు ఉండగా 25228 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.47శాతంగా పోలింగ్ నమోదైంది.చింతలపాలెం మండల పరిధిలో 26530 హెూటల్ ఉండగా 21021 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు 79. 23శాతంగా నమోదైంది. హుజూర్‌నగర్‌మండల పరిధిలో 50556 ఓటర్లు ఉండగా 37727 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు 74.62 శాతం నమోదయింది గరిడేపల్లి మండల పరిధిలో 46145 మంది ఓటర్లు ఉండగా 35923 ఓటు హక్కును వినియోగించుకున్నారు 72.85శాతంగా పోలింగ్ నమోదైంది. 2018 పార్లమెంట్ ఎన్నికల్లో 77.02 శాతంగా పోలింగ్ నమోదైంది. ఈసారి 2024లో 76. 30శాతంగా పోలింగ్ నమోదైంది. మొత్తం మీద చూసుకున్నట్టయితే గతం కంటే ఓటింగ్ శాతం తగ్గింది.





బీమా చేయండి..దీమాగా ఉండండి

నవతెలంగాణ-తుంగతుర్తి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్షబీమాయోజన పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు కోరారు.మంగళవారం నాగారం మండలపరిధిలోని పస్తాల గ్రామానికి చెందిన నాతి సోమయ్యకు రూ.2లక్షల ప్రధానమంత్రి బీమా చెక్కును అందజేసి మాట్లాడారు.ఈ మేరకు నాతి యాదమ్మ నల్లగొండ జిల్లా సహకారకేంద్ర బ్యాంకు తుంగతుర్తి బ్రాంచిలో అకౌంట్ కలిగి ఉండి ఇటీవల అనారోగ్యంతో మరణించిన సందర్భంగా యాదమ్మ భర్తకు చెక్కు అందజేశామన్నారు.సహకార బ్యాంకు నందు అకౌంటు కలిగి ఉండి రూ.436 ప్రధానమంత్రి బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ చెల్లించిన ప్రతి ఒక్కరికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రవణ్‌కుమార్,ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్,సొసైటీ సీఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మరకత మహాలక్ష్మీమదేవి ఆలయం వార్షికోత్సవం

నవతెలంగాణ-కోదాడరూరల్



మండలపరిధిలోని తొగర్రాయి గ్రామంలో కొలువై ఉన్న మరకత మహాలక్ష్మి దేవి అమ్మవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం ఆలయకమిటీ సభ్యులు కనుల పండువగా మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చివరి రోజు అమ్మవారిని తీరొక్కపూలతో అలంకరించి విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచన, చూర్ణోత్సవం, వసంతోత్సవం, అభిషేకం,చక్రస్నానం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు ప్రధాన వశిష్టులు పారశరాం రామకృష్ణమాచార్యులు పరవేక్షణలో భారీగా తరలివచ్చిన భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలేబోయిన వెంకయ్య, యాదాఉపేందర్ రావు, గుండపునేని ప్రభాకర్, బుడిగంనాని, కొండల్‌రావు, వీరస్వామి, తేరళవీరస్వామి, యాదమోహన్‌రావు, గుండెబోయిన. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్హతకు మించి వైద్యం చేసిన సుప్రజ హాస్పిటల్

- ల్యాబ్ ఆపరేషన్ థియేటర్స్‌ను సీజ్ చేసిన డీఎంహెచ్‌ఓ
- 15 రోజులు ఓపీ సేవలు నిలిపివేత

నవతెలంగాణ-సూర్యాపేట

అర్హతకు మించి వైద్యసేవలందిస్తున్న సుప్రజ హాస్పిటల్‌లో ల్యాబ్ ఆపరేషన్ థియేటర్స్‌ను సీజ్ చేశామని డీఎంహెచ్‌ఓ కోటాచలం తెలిపారు. మంగళవారం స్థానిక సుప్రజ ఆస్పత్రిలో ఆయన తనిఖీలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత మార్చి నెల నుండి ఇప్పటివరకు అర్హత లేకుండా ఇప్పటికే 46 సర్జరీలు చేశారని తెలిపారు.ఇందులో భాగంగా 15 రోజులు ఆస్పత్రి ఓపీ సేవలు నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. ల్యాబ్,ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశామని తెలిపారు. సరైన వివరణ ఇవ్వకపోతే ఆస్పత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోరారు.

కాంగ్రెస్ కుటుంబసభ్యులందరికీ ధన్యవాదాలు

నవతెలంగాణ-తిరుమలగిరి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమారెడ్డి గెలుపు కోసం కష్టపడి పనిచేసిన పార్టీ మండలనాయకులకు, గ్రామ శాఖ అధ్యక్షులకు, నాయకులకు, కార్యకర్తలకు, కాంగ్రెస్ కుటుంబసభ్యులందరికీ పేరుపేరునా కాంగ్రెస్ మండల కమిటీ తరపున అధ్యక్షులు ఎలిసోజు నరేష్ ధన్యవాదాలు తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మండలంలో భారీగా పోలింగ్ నమోదు

నవతెలంగాణ-మునగాల

ఈ నెల13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు అన్ని గ్రామాల్లో భారీగా పోలింగ్ నమోదైంది.మండలంలోని 44 పోలింగ్‌బూత్‌లో కూడా ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని ఓటుహక్కును వినియోగించుకున్నారు. మునగాల మండలంలో 35876 ఓట్లకుగాను 27909ఓట్లు పోలయ్యాయి.మండలవ్యాప్తంగా77.79శాతం పోలింగ్ నమోదైంది.22 గ్రామ పంచాయతీ ల పరిధిలో ఓటింగ్‌ను పరిశీలిస్తే నేలమర్రి గ్రామంలో మొత్తం 2079 ఓట్లకుగాను 1563 ఓట్లు పోలయ్యాయి.ఈదులవాగుతండాలో 395కు 325,వెంకట్రాపురంలో 851కి గాను 663,తాడువాయిలో 1884ఓట్లకు1570 పోలయ్యాయి.మా ధవరంలో 1649 గాను1260,జగన్నాధపురంలో 1008ఓట్లకు 853 పోలయ్యాయి.నర్సింహులగూడెంలో 2420కి 1972,రేపాలలో 1719 ఓట్లకు 1350,సీతానాగారంలో 740 ఓట్లకు 496,విజయరాఘవాపురంలో1382ఓట్లకు 1032,కలకోవలో 2068 ఓట్లకు 1554 పోలయ్యాయి.నారాయణగూడెంలో 1592ఓట్లకు1415 ఓట్లు పోలయ్యాయి.మునగాలలో5286 ఓట్లకు గాను 3858 ఓట్లు పోలయ్యాయి.గణపవరంలో 1298 కి 1017 ఓట్లు పోలయ్యాయి. కొక్కిరేణిలో 843కు 638, తిమ్మారెడ్డిగూడెంలో 1043కు873 ఓట్లు పోలయ్యాయి.బరాఖత్‌గూడెంలో 2886ఓట్లకు గాను 2330, కృష్ణానగర్‌లో 798 ఓట్లకు 691,ముకుందా పురంలో2204 ఓట్లకుగాను 1665 ఓట్లు పోలయ్యాయి. కోదండరామాపురంలో 857 ఓట్లకు గాను 623,ఆకుపాములలో మొత్తం ఓట్లు 1751కిగాను 1357,నర్సింహాపురంలో 1023ఓట్లకు గాను 804ఓట్లు పోలయ్యాయి.భారీసంఖ్యలో ఓట్లు పోలవ్వడంతో ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వుంటాయనేది మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-తిరుమలగిరి

తెలంగాణ మలిదశవిద్యార్థి ఉద్యమ రథసారథి, రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్"పిడమర్తి రవి అన్న జన్మదిన సందర్భంగా తిరు మలగిరి పట్టణకేంద్రంలోని ప్రజా నర్సింగ్ హోమ్, వివిధ హాస్పిటళ్లలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలనాయకులు కొమ్ము ప్రవీణ్, ఎర్రనరేష్(టీం-సామేలన్న) బహుజనవాది మందులసతీష్, ఎన్ఎంయూఐ తిరుమలగిరి మండల ప్రధాన కార్యదర్శి కొమ్మునవీన్, బొడగణేష్, కేసాగల్ల ప్రశాంత్, ఎర్రవెంకటేష్, సురేష్, కృష్ణ,గోపి, తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : బీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు,తెలంగాణ విద్యార్థి ఉద్యమనేత,తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి తెలంగాణ రాష్ట్ర సాధనలో చేసిన కృషి మరువలేనిదని ఓయూ నేతమిట్టగడుపుల రమేష్ అన్నారు.మంగళవారం తుంగతుర్తి మండలకేంద్రంలో పిడమర్తిరవి జన్మదినవేడుకలను ఘనంగా నిర్వహించి మాట్లాడారు.ఈ మేరకు డాక్టర్ పిడమర్తిరవి ముున్ముందు ఉన్నతమైన పదవులు చేపట్టాలని,ఏ పదవిలో ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమస్యలపై అనునిత్యం పోరాటం చేయాలని కోరుకుంటున్నామని తెలిపారు.

సీపీఐ(ఎం) నాయకులపై దాడికి ఖండన

నవతెలంగాణ-నేరేడుచర్ల

సీపీఐ(ఎం) నేరేడుచర్ల మండల సోషల్ మీడియా కన్వీనర్ జీడిమెట్ల రవిపై జరిగిన దాడిని ఆ పార్టీ మండలకార్యదర్శి సిరికొండ శ్రీను,కాంగ్రెస్ పెంచికల్‌దిన్న ఎంపీటీసీ వీరమాచినేని కృష్ణయ్య ఖండించారు. మంగళవారం పెంచికల్‌దిన్నలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఐ(ఎం) నాయకుడు రవి ఇంట్లో ఉండగా అదేగ్రామానికి చెందిన ఎల్లబోయినభాను, సిద్ధపంగనరేష్, బోయిళ్లరవి బైక్ మీద వచ్చి ఇంటికొచ్చారన్నారు.రవిపై దుర్భాషలాడుతూ కర్రతో అతనిపై భౌతిక దాడులకు పాల్పడ్డారన్నారు.దీంతో మెడపై గాయాలయ్యాయన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వీరమాచినేని కృష్ణయ్య, సీపీఐ(ఎం) మండల నాయకులు అల్వాల శ్రీధర్, మర్రినాగేశ్వర్‌రావు, పెరుగునాగరాజు, భార్గవ సైదులు, పెండెం హరిబాబు, చిలకరాజు లక్ష్మీనర్సు, కట్టా సుధాకర్, కోడిరెక్క పవన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌షాక్‌తో దున్నపోతు మృతి

నవతెలంగాణ-నాగారం

మండలపరిధిలోని ఢీకొత్తపల్లి శివారులో విద్యుత్‌షాక్‌తో దున్నపోతు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. గ్రామస్తులు వివరాల ప్రకారం..ఢీకొత్తపల్లి గ్రామానికి చెందిన లింగాల అంజయ్యకు చెందిన దున్నపోతు శనివారం కురిసిన అకాల వర్షానికి విద్యుత్ వైర్లు తెగి పడిశాల ధనంజయ పొలంలో పడగా నీళ్ల తాగడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది.దీని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితుడు కోరారు.



నవతెలంగాణ
యాదాద్రి భువనగిరి
బుధవారం | మే 15, 2024 | www.navatelangana.com

ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు ఆన్లైన్ ధరఖాస్తులు

నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో 2024 మార్చిలో 10వ తరగతి ఉత్తీర్ణులై జీపీఏ 7 గ్రేడ్, ఆపైన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, మరియు వికలాంగ విద్యార్థుల నుండి 2024-25 సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్ కోసం ఈనెల 15 నుండి 30 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోనునప్పుడు అవసరమైన ధృవపత్రములను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవలేనని తెలిపారు. విద్యార్థులు వారి ధరఖాస్తును ఆన్‌లైన్‌లో https://telanganaepass.cgg.gov.in అను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, అన్ని ధృవీకరణ పత్రములు ఉండాలని తెలిపారు. వివరములకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయము, కలెక్టర్ కాంప్లెక్స్, రూమ్. నెం.17, రాయగిరిలో సంప్రదించవచ్చునని తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన చామల



నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం బాక్సులను భద్రపరిచిన అరోరా ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూములను కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. అధికారులు కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పోత్నక్ ప్రమోద్ కుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి బాలలక్ష్మి, భువనగిరి మున్సిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, స్పోక్స్ పర్సన్ వచన కుమార్ వారి వెంట ఉన్నారు.

అకాల వర్షంతో రైతుల ఆందోళన

- ఇప్పటివరకు కొనుగోలు చేసింది 2.20 లక్షల టన్నులు
- ఇంకా లక్షకు పైగా టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది
- లారీడ్రైవర్ల సమ్మెతో మార్కెట్లలో నిలిచిపోయిన ధాన్యం
- ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రైతుల ధర్నాలు



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏప్రిల్ ఒకటవ తేదీన జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, హమాలీల కొరత, గన్ని బ్యాగుల కొరత, వాహనాల కొరతతో వారం పది రోజులు లేటుగా కొనుగోలు ప్రారంభించారు. కొనుగోలు ప్రారంభించి నెల మీద వారం గడుస్తున్నప్పటికీ , ఇప్పటివరకు కనీసం సగం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు.

జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వివరాలు ఇలా..

యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో ఐకెపి కొనుగోలు కేంద్రాలు 85, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలు 225, రైతు ఉత్పత్తి సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలు 13 చొప్పున ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సుమారు 250కి పైగా వాహనాలను సమకూర్చారు. రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరతతో ఒక లారీ అన్లోడ్ కావడానికి కనీసం రెండు మూడు రోజులు కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ధాన్యం దిగుబడి ఇలా..

యాదాద్రి భువనగిరి జిల్లాలో యాసంగి సీజన్లో 2 లక్షల 93 వేల ఎకరాల విస్తీర్ణంలో వారిని సాగు చేశారు. దిగుబడి ఐదు లక్షల 25వేల మెట్రిక్ టన్నులు వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయగా, నాలుగు లక్షల వరకు కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాల అలసత్వంతో అధికారులు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఏర్పాటు చేశారు.

ఇప్పటివరకు కొనుగోలు చేసింది 2.20 లక్షల మెట్రిక్ టన్నులు..

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మెట్టు టన్నులు ధాన్యాలు దిగుబడి అంచనా వేగం ప్రస్తుతం రెండు లక్షలకు పైగా కొనుగోలు చేశారు. కాగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఇప్పటివరకు సుమారు 44 రోజులు గడుస్తుంది. సగం దాన్యం మాత్రమే కొనుగోలు చేశారు ఇంకా సగం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. రైస్ మిల్లులకు తరలించింది 2 లక్షల 9886 మెట్రిక్ టన్నులు, ఇంకా ఒక వెయ్యి 912 మిల్లులకు తరలించాల్సి ఉంది. ఇప్పటివరకు 22 వేల 552 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. వీరికి 484.96 కోట్లకు గాను 300.23 కోట్లు చెల్లించారు. ఇంకా 184 .73 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతలు ధర్నాలు..

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నేటికి 45 రోజులు గడుస్తున్న కొనుగోలు ప్రక్రియ సరిగా కొనసాగడం లేదని, అధికారులు సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ముంగట ధర్నా చేశారు. బీబీనగర్ మండలానికి చెందిన రైతులు ఏప్రిల్ నెలలో, మే నెలలో కలెక్టర్ కార్యాలయం ముందు దాన్యం కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహించారు. కాగా మోత్కూరు, ఆత్మకూరు(ఎం) గుండాల, రాజపేట మండలంలోని రైతులు రహదారులపై రాస్తారోకో సైతం చేశారు.

లారీ డ్రైవర్ల సమ్మె...

పోచంపల్లి మండలంలో పిలాయిపల్లి గ్రామంలో బాలాజీ రైస్ మిల్ యజమాన్యం, లారీ డ్రైవర్ మధ్య గొడవ జరగగా.. యజమాన్యం లారీ డ్రైవర్ పై చేయి చేసుకున్నాడని ఆరోపిస్తూ లారీ డ్రైవర్లు మూడు రోజులు ధర్నా చేపట్టారు. అధికారులు చర్చించి సమ్మెను విరమింప చేసినప్పటికీ, ఈ ధర్నా చేయడం వలన మూడు రోజులు ధాన్యం కొనుగోలు చేసిన ఉపయోగం లేకుండా పోగా, అకాల వర్షానికి ధాన్యం తడిచింది.

పోచంపల్లిలో ఓటింగ్ బహిష్కరణ..

ఆదివారం రాత్రి అకాల వర్షంతో పోచంపల్లి మండల వ్యాప్తంగా సుమారు 70 వేల బస్తాలు తడిచిపోవడంతో రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తూ కనుముక్కల గ్రామంలో ఓటింగ్ బహిష్కరించారు. వెంటనే తాసిల్దార్ ఎస్సైలు వారితో చర్చించి, ఓటులో పాల్గొనేలా ఒప్పించారు.

మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆకుతోట బాయి తండా రైతుల ధర్నా..

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యాదాద్రి భువనగిరి కలెక్టర్ కార్యాలయం ముందు భువనగిరి మండలంలోని ఆకుతోట బావికి చెందిన రైతులు కలెక్టర్ కార్యాలయం ముందు ధాన్యం పోసి ధర్నా నిర్వహించారు. ధర్నాలు అడ్డుకోబోయిన పోలీసు అధికారి కాళ్లను రైతులు మొక్కడంతో రైతులు ఎంత ఇబ్బందులు పడుతున్నారనేది మనం అర్థం చేసుకోవచ్చు. అధికారుల హామీతో ధర్నా విరమింప చేశారు.

ఇప్పటికైనా అధికారులు యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా భువనగిరి జిల్లాలో కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ ధాన్యాన్ని భావి వద్దనే కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాలలో కొంతమంది సర్పంచులు ఎంపీటీసీల పేరుతో ముందుగా సీరియల్ నెంబర్ వంకతో కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్థలభావం కొరతతో కొంత ఆలస్యం జరిగింది: జిల్లా సివిల్ సప్లై మార్కెటింగ్ మేనేజర్ గోపికృష్ణ

రైస్ మిల్లులు ధాన్యం దిగుమతి చేసుకోవడానికి స్థల భావం కొరత వలన కొంత ఆలస్యం జరిగిందని, ఈ విషయాన్ని అధికారులకు నివేదించగా, జనగాం జిల్లాకు 20,000 మెట్రిక్ టన్నులు, నల్గొండ జిల్లాకు పదివేల మెట్రిక్ట్ టన్నులు, రంగారెడ్డి జిల్లాకు పదివేల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుమతి చేసుకోవడానికి అనుమతులు లభించిందని త్వరలోనే పూర్తి ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు.



ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

- ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

ప్రభుత్వం ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. మంగళవారం జైకేసారం మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రెండు నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయకపోవడం రైతులకు శాపంగా మారిందని అన్నారు. రైతులపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. సమయానికి గన్ని బస్తాలు సరఫరా చేయకపోవడం ధాన్యం కుప్పలు పేరుకుపోయాయని అన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయకపోతే నేషనల్ హైవే దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు ఆపి రైతుల పక్షాన నిలబడాలని అన్నారు. అదేవిధంగా ఈ సీజన్లోనే రైతు భరోసా కింద క్వింటాకు రూ.500 బోనస్ కల్పించి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని అన్నారు. అనంతరం చరవాణి ద్వారా జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు ధాన్యం కొనుగోలుని వేగవంతం చేయాలని తెలియజేశారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మరుసటిరోజే భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి జహంగీర్ రైతుల పక్షాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడం సీపీఐ(ఎం) పార్టీకే దక్కిందని రైతులు చర్చించుకుంటున్నారు. ధాన్యం పరిశీలించిన వారిలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, సీపీఐ(ఎం) మండల నాయకులు సింగిల్ విండో మాజీ చైర్మన్ చీరిక సంజీవరెడ్డి, నాయకులు రాగిరు కిష్టయ్య, పల్లె మధు కృష్ణ, పొట్ట శ్రీనివాస్, చిరిక అలివేలు, బోదాస్ వెంకటేశం, మాడగొని మారయ్య, పల్లె శివకుమార్, దొడ్డి లింగస్వామి, సమ్మిరెడ్డి సత్తిరెడ్డి, రాగీరు యాదయ్య, పల్లె అనిల్ కుమార్, పాలమకుల రాకేష్, వనం విజయ్ కుమార్, రుద్రగోని మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

- టీఏడీఏ చెల్లించాలన్నందుకు ఉపాధ్యాయులపై లాఠీచార్జి దారుణం
- తీవ్రంగా ఖండించిన టీఎస్‌యూటీఎఫ్
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

నవతెలంగాణ-భువనగిరి

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనలప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై నారాయణఖేడ్ ఆర్డీఓ పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) యాదాద్రి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆర్డీఓ మరియు పోలీసులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ యాదాద్రి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిరియాల దామోదర్, మెతుకు సైదులు మంగళవారం డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీఓ, ఏపీఓలకు రోజుకు రూ 600, ఓపీఓలకు రూ.400 రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం. 61ని ఈ నెల 11న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పిఒ, ఎపిఒలకు రూ.3,150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో 2,400 మాత్రమే ఇచ్చారన్నారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని ఆరోపించారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన నారాయణఖేడ్ ఆర్డీఓ మరియు పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషనర్, కలెక్టర్ల కృషితో పెరిగిన ఓటింగ్

- ఓటు వినియోగించుకోవడం పట్ల హర్షం
- ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు



నవతెలంగాణ-భువనగిరి

రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్, అన్ని జిల్లాల కలెక్టర్లతో, ఎన్నికల అధికారులు సహకారంతో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేశారని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో ఓటర్లు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కు వినియోగించుకుని 64.93 శాతం ఓటింగ్ నమోదు అయిందన్నారు. శాంతి భద్రతలు పరిరక్షణలో, ఓటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్ర డీజీపీ రావిగుప్త, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిలు, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిల కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా భువనగిరి నియోజకవర్గంలో 76.47 శాతం ఓటింగ్ నమోదు అయిందని వివరించారు. ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్లు, ఎస్పి లు, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ వంటి స్వచ్ఛంధ సంస్థలు ఓటింగ్ శాతం పెంచేందుకు కృషిచేసినట్లు తెలిపారు. తమ సంస్థ సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో భొనగిరి నియోజక వర్గం లోని నార్కెట్ పల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చండూరు మండలాలలో ఓటరు చైతన్య అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచేందుకు కృషించేసినట్లు తెలిపారు. దీంతో పాటు హైదరాబాద్, నల్గొండ, సూర్యాపేట జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లో ఓటరు చైతన్య సదస్సులు, ర్యాలీలు, చర్చావేదికలు, ప్రతిజ్ఞ లు చేయించి ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి తదితర ప్రాంతాలలో ఓటింగ్ శాతం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నికలలో నైనా ఓటర్లు ఓటుకు విలువ ఇచ్చి స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రావాలని సూచించారు. ప్రతి ఓటు విలువైనదని ఓటర్లు ఓటు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. మొత్తం మీద ఎన్నికలలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ కు, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, డీజీపీ రవిగుప్త, అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అప్ అధికారులకు, ఎస్పి లకు, ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న సిబ్బందికి, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

సిట్టింగ్ ఎంపీ సెల్వ రాజు మృతి పట్ల సంతాపం

- సెల్వ రాజు ఆశయాలు కొనసాగిద్దాం: గోదా శ్రీరాములు

నవ తెలంగాణ-రాజపేట

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు తమిళనాడు పార్లమెంట్ సభ్యులు సెల్వరాజు గుండెపోటుతో మరణించడం పట్ల గోదా శ్రీరాములు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని బేగంపేట గ్రామంలో చిగుళ్లలింగం అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల జనరల్‌బాడీ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గోద శ్రీరాములు హాజరై మాట్లాడారు. సెల్వ రాజు సాగునీరు కోసం కావేరి నది జలాలు మళ్లించాలని, బీడు భూములను సస్యశ్యామలం చేయాలని, నాలుగు నెలలపాటు పాదయాత్ర కొనసాగించారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి స్పందించి వారి పోరాటాల అనుగుణంగా కావేరి నది జలాలు ఆ ప్రాంతానికి తీసుకువచ్చారని అన్నారు. ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచుటకు పోరాటాలు కొనసాగించి అనేక విజయాలు సాధించారన్నారు. అలాగే నిరంతరం ప్రజా సమస్యల పరిష్కరించేందుకు నిమగ్నం అయ్యేవారు అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, చెడుదీపు రామస్వామి, మూల రామచంద్రం, జల్ల వెంకటయ్య, మూల రాములు, ఒగ్గు కరుణాకర్, గుర్రం రాములు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)ని ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు

- పార్టీ మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం

నవతెలంగాణ-రామన్నపేట

సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి జహంగీర్‌కు నిజాయితీగా ఓట్లు వేసి ఆదరించిన మండల ఓటర్లకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాలక పార్టీలు ఎన్నికల నియామవళికి విరుద్ధంగా మద్యం, డబ్బులు ప్రలోభాలు విపరీతంగా చూపినా వాటిని తిరస్కరించి నిత్యం ప్రజల కోసం ఉద్యమాలు నిర్వహించే సీపీఐ(ఎం)కు ఓటు వేసేందుకు సుదూర ప్రాంతాల నుండి వచ్చారన్నారు. ప్రజాస్వామ్యం బ్రతకాలంటే నిజాయితీపరులను ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలన్నారు. ప్రచార సమయంలో ప్రజల నుండి అనూహ్య స్పందనతో పాటు ప్రజా సమస్యలు కూడా తెలిసాయని, ఒక కార్యచరణ రూపొందించి ప్రణాళిక బద్ధంగా ధన్యవాదాలు వాటిపై ప్రజలను కూడగట్టి పోరాటం చెస్తామని అన్నారు.



గ్రామీణ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

గ్రామీణ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్ అన్నారు. తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆలేరు మండలం శారాజిపేట గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ కోలాట బృందం కళాకారుల సమావేశం కళ్లెం అండాలు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. గ్రామీణ కోలాట కళాకారులకు గుర్తింపు కార్డులు, కళాకారులకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కళాకారులకు పేద కుటుంబాలకు రూ.5 లక్షల రుణ సౌకర్యం వర్తింపజేయాలన్నారు. గ్రామీణ అర్హులైన కళాకారులందరికి ప్రభుత్వం ఆదుకోవాలని, యాదాద్రి లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరిగే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కళాకారులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎలేంద్ర, లక్ష్మీ, నరసమ్మ, అనిత, రాణి, లక్ష్మి, శిరీష, సరిత, రేణుక, నరసమ్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలి

- సమస్య పరిష్కరించకుంటే రైతాంగంతో ఆందోళన చెస్తాం
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి



నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న వడ్ల కొనుగోలునూ వేగవంతం పూర్తిచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రంగం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం విడనాడాలని, మార్కెట్లలో దాన్యం పోసి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ యాభై శాతం దాన్యం కొనుగోలు పూర్తి చేయకపోవడం దారుణం అన్నారు. మండల వ్యాప్తంగా 26 కెంద్రాల్లో ఐదు లక్షల బస్తాలు మాత్రమే తూకం జరిగిందన్నారు. ఇంకా ఆరు లక్షల బస్తాలు కొనుగోలు కేంద్రాలలో ఉన్నాయన్నారు. వానకు నాని, ఎండకు ఎండి పోతున్నాయన్నారు. దిక్కు తోచని స్థితిలో రైతాంగం ఉందన్నారు. నెలల తరబడి రైతులు రాసుల కావలి కాయాల్సివస్తుందన్నారు. దీంతో పట్టాల కిరాయి అధిక ఆర్థిక భారం అవుతోందన్నారు. ఇప్పటికే నా కాలం సీజన్ ప్రారంభమయి దున్నకాలు సాగుతున్నాయి అన్నారు. మండల పరిసర ప్రాంతంలో రైస్ మిల్లుల కొనుగోలు టార్గెట్ అయిపోగానే వేరే మిల్లులను అలాట్ చేసి తరలించే ప్రయత్నం ప్రభుత్వ యంత్రాంగం చేయడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ కేంద్రానికి రోజుకు రెండు లారీలు లోడ్ చేసి 24 గంటల్లో అన్ లోడ్ చేయాలాన్నారు. రెండు రోజుల్లో కొనుగోలును యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేయడం కోసం ప్రభుత్వ అధికారులు చొరవ చూపకపోతే రైతులతో మండల కేంద్రంలో ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జల్లెల పెంటయ్య, సీపీఐ (ఎం) పార్టీ మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు వనం ఉపేందర్, రైతు సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు గన్నెబోయిన విజయభాస్కర్, బోయిన ఆనంద్, కందుల హనుమంతు, బల్గూరి అంజయ్య, కల్లూరి నగేష్, బావండ్లపల్లి బాలరాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ప్రభుత్వాన్ని నిలదీయాలి



నవతెలంగాణ-ఆలేరుటౌన్

భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ప్రజాసమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని నిలదీయాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు బుగ్గ నవీన్ అన్నారు. మండలంలోని శర్బనాపురం గ్రామంలో మంగళవారం డీవైఎఫ్ఐ గ్రామశాఖ అధ్యక్షుడు గడ్డమీది ప్రశాంత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నిరుద్యోగ, యువజన, ప్రజా వ్యతిరేక విధానాలపై యువత పోరాడాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తితో, భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని తెలిపారు. అనంతరం డీవైఎఫ్ఐ శర్బనాపురం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యకులుగా సైదాపురం నరేష్, కార్యదర్శిగా సుధగాని మల్లేష్, గౌరవాధ్యకులుగా బుగ్గ ప్రవీణ్, గౌరవసలహాదారుగా సూదగాని నవీన్, ఉపాధ్యక్షులుగా కారె శ్రీకాంత్, ఏదు నవీన్, సహాయకార్యదర్శులుగా తుంగ కిరణ్, కారె మణికంఠ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ నాయకులు కారె రాజు, నాయకులు సిరిగిరి స్వామి, సూదగాని నరేందర్, సైదాపురం ప్రశాంత్, వట్టేపు సిద్ధార్థ, ఏదు ప్రకాష్, సైదపురం నాగరాజు, గడ్డమీది వంశీ, బుగ్గ సాయికుమార్, సైదాపురం హేమంత్ పాల్గొన్నారు.

ఫలించిన చర్చలు.. ప్రారంభం కానున్న ధాన్యం కొనుగోళ్లు

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

లారీ యజమానుల సమ్మెతో నిలిచిపోయిన ధాన్యం కొనుగోలు నేడు లారీ యజమానులు, రైస్ మిల్లర్ల చర్చలు ఫలించాయి. ఇటీవల పిలాయిపల్లి గ్రామ సాయి బాలాజీ రైస్ మిల్ యాజమాన్యం గేటుకి అడ్డంగా నిలిచిన లారీ డ్రైవర్‌పై చేయించుకోవడం లారీ అద్దాలు పగలగొట్టి దుర్భాషలాయడంతో లారీ డ్రైవర్ యజమానులు సమ్మె దిగారు. ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి లారీ యజమాన్యం రైస్ మిల్లు యజమాన్యాన్ని సమావేశం ఏర్పాటు చేసి అందరికి నచ్చజెప్పి రైతులను ఇబ్బంది పెట్టొద్దని సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని రైతుల మీద ప్రభావం చూపుతోందని అన్నారు. వ్యవసాయ అధికారులకు ధాన్యం పరిశీలించి రైస్ మిల్లర్లకు పంపించాలని రైస్ మిల్లర్లు వెంటనే లారీల ధాన్యాన్ని దింపుకోవాలని సూచించారు. ఫలితంగా మండల వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్ మార్కెట్లలో ధాన్యం కొనుగోలు కలిసిపోయాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తూకం వేసిన ధాన్యం బస్తాలు తడవడంతో.. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కనుముక్కల గ్రామస్తులు ఓటు వేయకుండా ధర్నాకు దిగడంతో ప్రభుత్వం స్పంధించింది. ఫలితంగా సాయి బాలాజీ రైస్ మిల్ యాజమాన్యం లారీ యజమాని డ్రైవర్‌కి క్షమాపణ చెప్పడంతో సమస్య పరిష్కారమైంది. రైతులు వారు పండించిన ధాన్యం ఏ గ్రేడ్ ఆ బి గ్రేడ్ తెలవక ధాన్యం తూకంలో పరుగు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యాన్ని పరీక్షించి తాలు లేకుండా ప్రేమ లేకుండా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ధ్రువీకరించాలన్నారు తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు పంపించాలని నాయకులు సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ మాజీ పిఏసిఎస్ చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బేగంపేటలో సీపీఐ నాయకుడు మృతి

- నివాళులు అర్పించిన సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని బేగంపేట గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకులు దేవి రామచంద్రం అనారోగ్యంతో మరణించాడు. మంగళవారం మండలశాఖ కార్యదర్శి చిగుళ్ల లింగం ఆధ్వర్యంలో నివాళులు అర్పించిన సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడారు. రెండు పర్యాయాలు సీపీఐ గ్రామశాఖ కార్యదర్శిగా పనిచేశారని ఆయన సేవలను కొనియాడుతూ కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి మూల హరినాథ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరి రాజయ్య, మండల కార్యదర్శి చిగుర్ల లింగం, యాదగిరిగుట్ట మండల కార్యదర్శి ,కల్లపల్లె మహేందర్, చేడీదీపు రామస్వామి, జెల్ల వెంకటయ్య, బాబుపేట వెంకటయ్య, ఒగ్గు కరుణాకర్, జెల్ల బాలురాజు, మూల రాములు, మూల రామచంద్రం, దేవి సత్తయ్య, గుర్రం రాములు పాల్గొన్నారు.

4
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
బుధవారం | మే15. 2024 | www.navatelangana.com

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ధ్వంసమైన మిషన్ భగీరథ పైప్‌లైన్



నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని బేగంపేట వాగులో బ్రిడ్జ్ నిర్మాణం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మంగళవారం మిషన్ భగీరథ పైప్ లైన్ ధ్వంసం అయింది. దీంతో నీరు వృధాగా పోయింది. పరిస్థితిని కప్పిపుచ్చేందుకు ధ్వంసం అయిన పైప్ లైన్ వద్ద జేసీబీ బకెట్‌ను అడ్డుపెట్టారు. ఈ విషయంపై రేణిగుంట బేగంపేట గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల శాఖ కార్యదర్శి చిగుళ్ల లింగం డిమాండ్ చేశారు.

ఈవీఎంలను భద్రపరిచిన ఎన్నికల అధికారి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం పోల్ అయిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను మంగళవారం భువనగిరి పట్టణంలోని ఆరోరా ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో భద్రపరిచినట్లు భువనగిరి పార్లమెంట్ ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ హనుమంతు కే జెండగే తెలిపారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోకి వచ్చే ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్, ఇబ్రహీంపట్నం, జనగాం, మునుగోడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎం యంత్రాలను ఆయా నియోజకవర్గాల వారిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో కేంద్ర ఎన్నికల కమిషన్ జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ క్షేత్రమయుమ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే.జెండగే, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్ షాలోమ్, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

నల్గొండ పార్లమెంటు నియోజకవర్గంలో 74.02 పోలింగ్ నమోదు

- పోలింగ్ ప్రశాంతం
- సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన దాసరి



నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

నల్గొండ పార్లమెంటు స్థానానికి సోమవారం నిర్వహించిన ఎన్నికలలో 74.02 శాతం పోలింగ్ నమోదయినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు.జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, ఎలాంటి వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ఆమె వెల్లడించారు. ఈనెల 13 న ఉదయం 7 గంటలకు ప్రారంభమైన లోకసభ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిందని , కొన్ని చోట్ల ఓటింగ్ సమయానికి ముందే వచ్చి క్యూ లైన్లో ఉన్న ఓటర్లకు టోకెన్లు అందజేసి పోలింగ్ నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.నల్గొండ పార్లమెంటు పరిధిలోని మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా పోలైన ఓట్ల వివరాలను ఆమె తెలియజేస్తూ..

86 -దేవరకొండ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 131838 పురుష ఓటర్లు,130624 మహిళా ఓటర్లు,18 మంది ఇతర ఓటర్లు , మొత్తం 262480 ఓటర్లు ఉండగా, సోమవారం నాటి పార్లమెంటు ఎన్నికలలో 94896 పురుష ఓటర్లు, 90405 మహిళ ఓటర్లు, ఇతరులు 9 మంది మొత్తం 185310 మంది ఓటర్లు ఓటు వేశారని, ఈ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 70.60 శాతం పోలింగ్ నమోదయ్యిందని వెల్లడించారు.

87- నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 115852 పురుష ఓటర్లు, 120611 మహిళా ఓటర్లు,21 ఇతర ఓటర్లు, మొత్తం 236484 ఓటర్లు ఉండగా, 87949 పురుష ఓటర్లు, 88231 మహిళా ఓటర్లు ,10 మంది ఇతర ఓటర్లు,మొత్తం 176190 ఓటర్లు ఓట్లు వేశారని, నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల్లో 74.50 శాతం ఓట్లు పోలయ్యాయని కలెక్టర్ పేర్కొన్నారు.

88 -మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 11 5773 పురుష ఓటర్లు, 120544 మహిళా ఓటర్లు,26 మంది ఇతర ఓటర్లు, మొత్తం 236343 ఓటర్లు ఉండగా, పార్లమెంటు ఎన్నికలలో 85811 పురుష ఓటర్లు, 87513 మహిళా ఓటర్లు,10 మంది ఇతర ఓటర్లు, మొత్తం 173334 ఓటర్లు ఓటు వేశారని, మిర్యాలగూడ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 73.34 పోలింగ్ శాతం నమోదైనట్లు వెల్లడించారు. 89- హుజూర్నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 121956 పురుష ఓటర్లు, 129471 మహిళ ఓటర్లు,17 మంది ఇతర ఓటర్లు, మొత్తం 251444 ఓటర్లు ఉండగా, పార్లమెంటు ఎన్నికలలో 94065 పురుష ఓటర్లు, 97871 మహిళా ఓటర్లు, 9 మంది ఇతర ఓటర్లు మొత్తం 191945 ఓటర్లు ఓటు వేశారని, ఈ నియోజకవర్గం పరిధిలో 76.34 పోలింగ్ శాతం నమోదయిందని పేర్కొన్నారు. 90- కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 11 9172 పురుష ఓటర్లు, 125997 మహిళా ఓటర్లు , 18 మంది ఇతర ఓటర్లు, మొత్తం 245187 ఓటర్లు ఉండగా, పార్లమెంట్ ఎన్నికలలో 90604 పురుష ఓటర్లు, 93801 మహిళ ఓటర్లు, 10 మంది ఇతర ఓటర్లు, మొత్తం 184415 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని, ఈ నియోజకవర్గ పరిధిలో 75.21 శాతం ఓట్లు పోలైనట్లు వెల్లడించారు. 91- సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 118949 పురుష ఓటర్లు, 125154 మహిళా ఓటర్లు,13 మంది ఇతర ఓటర్లు, మొత్తం 244116 ఓటర్లు ఉండగా, పార్లమెంటు ఎన్నికలలో 88069 పురుష ఓటర్లు, 90301 మహిళ ఓటర్లు, 8 మంది ఇతర ఓటర్లు కలుపుకొని మొత్తం 178378 మంది ఓటర్లు ఓటు వేశారని, సూర్యాపేట నియోజకవర్గం పరిధిలో 73.07 శాతం ఓట్లు పోలయ్యాయని ఆమె వెల్లడించారు. అదేవిధంగా 92- నల్గొండ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో 121303 పురుష ఓటర్లు, 128052 మహిళా ఓటర్లు, 56 ఇతర ఓటర్లు, మొత్తం 249411 మంది ఓటర్లు ఉండగా, పార్లమెంటు ఎన్నికల్లో 92203 పురుష ఓటర్లు , 95328 మహిళ ఓటర్లు, 34 ఇతర ఓటర్లు, మొత్తం 187565 ఓట్లు పోలయ్యాయిని, నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 74.02 ఓటింగ్ శాతం నమోదయినట్లు వెల్లడించారు.నల్గొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రజలు, ఓటర్లు, అధికారులు, మీడియా ప్రతినిధులు అందరికి ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థ

- ఎస్పీ చందనా దీప్తి



నవతెలంగాణ -నల్లగొండ టౌన్

పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పూర్తి చేసినట్టు ఎస్పీ చందనా దీప్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటికే అన్ని నియోజక వర్గాలలో ఈవీఎంలను అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్స్ దగ్గర పోలీసులు పటిష్ట బందోబస్తుతో భద్రపరిచామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర 144 సెక్షన్‌తో పాటు మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నాం అని స్థానిక పోలీసులు, ఆర్మ్ డ్ రిజర్వ్, కేంద్ర బలగాలు స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పహారా కాస్తున్నారు. స్ట్రాంగ్ రూం ల వద్ద 24 గంటలూ సాయుధ రక్షణలో ఉంటూ, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించబడుతుందన్నారు. స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.



కొండ జానయ్యను పరామర్శించిన దైద రవీందర్

నవతెలంగాణ- నకిరేకల్

నకిరేకల్ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు కొండ జానయ్య గౌడ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ శంకర్ గౌడ్, పందిరి సతీష్, యూసుఫ్, వంటేపాక నక్షత్, నల్లగొండ మహేష్, మామిడికాయల నాగయ్య, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వంటేపాక యాదగిరి ఉన్నారు.

భువనగిరి పార్లమెంట్ పరిధిలో 76.47 శాతం ఓటింగ్

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో 76.47 ఓటింగ్ శాతం నమోదయింది. భువనగిరి పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాలలో 18,08,585 ఓట్లు ఉండగా అందులో 13,88,680 ఓట్లు నమోదు అయ్యాయి. 76.47 పోలింగ్ శాతం నమోదయింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో ఓట్లు ఆరు రౌండ్లో 80.24శాతం నమోదయింది.

నియోజకవర్గాల వారిగా ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి

ఇబ్రహీంపట్నం: 3.39,341 ఓట్లు ఉండగా 226,790 ఓట్లు పోలయ్యాయి. 9 గంటలకు 8.79 శాతం, 11 గంటలకు 21.97, ఒంటిగంటకు 38.62, 3 గంటలకు 52.03, 5 గంటలకు 63,13,6 గంటలకు 66.81శాతం.

మునుగోడు: 2,57,57 ఓట్లు ఉండగా 2,26,790 ఓట్లు పోల్ అయ్యాయి. 9 గంటలకు 13.32,11 గంటలకు 32.61, ఒంటిగంటకు 50.37,మూడు గంటలకు 67.65, 5గంటలకు 79.67,6 గంటలకు 83.51 శాతం.

భువనగిరి: 2,20,596 ఓట్లగాను 1,82,462 కోట్లు పోల్ అయ్యాయి. ఉదయం 9 గంటలకు 9.13, 11 గంటలకు 27.1 గంటలకు 47.26, మూడు గంటలకు 66.22, 5 గంటలకు 74.24, 6 గంటలకు 81.74శాతం.

నకిరేకల్: 2,53,785 ఓట్లకు గాను 1,95,693 ఓట్లు పోలయ్యాయి. 9 గంటలకు 10.86 శాతం, 11 గంటలకు 29.34, ఒంటిగంటకు 47.4, మూడు గంటలకు 61.54 ఐదు గంటలకు 72.34,,6 గంటలకు 77.08శాతం.

తుంగతుర్తి: 2,59265 ఓట్లకు 1,91,693 ఓట్లు పోలయ్యాయి. 9 గంటలకు 10.65, 11 గంటలకు 29.98, ఒంటిగంటకు 49.19 మూడు గంటలకు 62.36,5 గంటలకు 71.3, 6 గంటలకు 73.7శాతం నమోదయింది.

ఆలేరు: 2,35,270 ఓట్లకు గాను 1,94,817 9 గంటలకు 10.53, 11 గంటలకు 29.26, ఒంటిగంటకు 50.44, 3 గంటలకు 68.4, 5 గంటలకు 79.12, 6 గంటలకు 82.52 శాతం.

జనగాం: 242,771 ఓట్ల గాను 1,81,302 ఓట్లు పోలయ్యాయి 9 గంటలకు 10.84,11 గంటలకు 27.5, ఒంటిగంటకు 45.03 గంటలకు, 60.04,5 గంటలకు 74.19శాతం . మొత్తము 76.47శాతం నమోదయింది.

గెలుపు.. నాదంటే నాదే అంటున్న అభ్యర్థులు

- ఈవీఎంలలో దాగివున్న అభ్యర్థుల భవిష్యత్తు
- జూన్ 4న తేలనున్న ఫలితాలు



నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

భునగిరికోటపై ఈసారి తమ జెండానే ఎగురుతుందని ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, క్యామమల్లేష్, ఎండి.జహంగీర్‌లు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే సుమారుగా 2 శాతం ఓటింగ్ పెరిగింది. పెరిగిన ఓటు శాతం ఎవరికి ఉపయోగపడుతుందనే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ పరిధిలో 2019 ఎన్నికల్లో 74.49 శాతం ఓటింగ్ నమోదవ్వగా 2024 మే 13న జరిగిన ఎన్నికల్లో 76.47శాతం ఓటింగ్ నమోదయింది. ఓటింగ్ శాతంలో రాష్ట్రంలోనే భువనగిరి ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రజా ఉద్యమాలకు కేంద్రబిందువైన భువనగిరి ప్రాంత ప్రజలు తమ చైతన్యాన్ని ఓటు ద్వారా మరోసారి నిరూపించబోతున్నారు. ఈవీఎం మిషన్లో దాగి ఉన్న అభ్యర్థుల భవిష్యత్తు జూన్ 4న తేలనుంది. ఎన్నికల్లో భువనగిరి పార్లమెంటు స్థానం నుంచి 39 మంది అభ్యర్థుల పోటీ చేయగా ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి మినహాయిస్తే బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ(ఎం) అభ్యర్థులు ఓటర్లను ఎట్లాంటి ప్రలోభాలకు గురి చేయలేదు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు బాధ్యతను భుజాన వేసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓటర్లను డబ్బుతో ప్రభావితం చేసేందుకు రూ.500ల చొప్పున 95శాతం ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పైన ఉన్న నమ్మకమో, డబ్బుల పంపిణీ ప్రభావమో కానీ భువనగిరి పార్లమెంట్లో అత్యధిక మంది ఓటర్లు కాంగ్రెస్‌నే నమ్మినట్లు ప్రచారం జరుగుతోంది. పట్టణ ప్రాంతాలు మినహాయిస్తే గ్రామీణ, గిరిజన తండాలో ఉండే ఓటర్లు అత్యధికులు కాంగ్రెస్‌వైపే ముగ్గి చూపినట్లు తెలుస్తోంది. సంస్థాగతంగా ఓటు బ్యాంకు, ప్రజా ప్రతినిధులు కలిగి ఉన్న బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితమైతుందనే చర్చ జరుగుతోంది. అనేక పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని చెప్పే ఏజెంట్లు కనిపించని పరిస్థితి నెలకొంది. డబ్బులు పంపిణీ చేసిన వారివైపే ఓటర్ల ముగ్గు చూపుతున్నారని, తమ పార్టీకి ఓటేయాలని అడిగే పరిస్థితిలో తాము లేమని బీఆర్ఎస్ నాయకులే బహిరంగంగా చెప్తున్న పరిస్థితి కనిపించింది. బీఆర్ఎస్‌కు చెందిన అభ్యర్థి క్యామ మల్లేష్ బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ ఆ సామాజిక వర్గ ప్రజలు ఆయనను అంతగా సేకరించినట్లుగా కనిపించడం లేదు. ఆస్తులు అంతస్తులు ఉన్నవాడిని అని బహిరంగంగానే ఆయన ప్రచారం చేసుకున్నప్పటికీ సొంత పార్టీ ఓటర్లకు సైతం డబ్బులు ఇవ్వకపోవడంతో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌పై ఉన్న అక్కస్సుతో బీఆర్ఎస్ నాయకులు కొన్ని ప్రాంతాల్లో బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. మూడో స్థానంలో ఉండాల్సిన బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ తనే గెలంపొందుతున్నానని చెప్పుకున్నారు. కాంగ్రెస్ నాకే ప్రధాన పోటీ అంటున్నారు. ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతోనే అనే ధీమాలో ఆయన ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం ద్వితీయ స్థానంలో ఉండాల్సిన బీఆర్ఎస్ తృతీయ స్థానానికి, తృతీయ స్థానంలో ఉండాల్సిన బీజేపీ ద్వితీయ స్థానానికి చేరుకునే అవకాశం ఉందంటున్నారు. ఓటర్లను ఆయా పార్టీల అభ్యర్థులు డబ్బులతో ప్రభావితం చేయకపోతే తామే గెలుస్తామని ధీమాలో ఉన్న సీపీఐ(ఎం) కాంగ్రెస్ డబ్బులను పంపిణీ చేయడం, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఓటర్లను ఇతర ప్రలోభాలకు గురి చేయడం వల్ల తాము ఆశించిన ఓటు బ్యాంకు తగ్గొచ్చనే అంచనాలో ఉన్నారు. జూన్ 4న వెలబడనున్న ఎట్లాంటి ఫలితాన్ని అయినా స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నాం అంటున్నారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ శాతం 2009లో 76.32 శాతం, 2014లో 81.27శాతం, 2019లో 74.49శాతం, 2024లో 76.47శాతం నమోదైంది.



స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రాజాపేట

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలసి చదువుకున్న 1995-96 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు తమ ఉదారతను, ఐక్యతను మంగళవారం మరోసారి చాటి చెప్పారు. ఇటీవల రేణిగుంట గ్రామంలో పూర్వ విద్యార్థి తంబునూరి లక్ష్మణ్ అనారోగ్యంతో మరణించాడు. వారి కుటుంబానికి టెంత్ మిత్రులు అందరూ కలిసి మృతుని కూతురు పేరు మీద రూ.45 వేల ఫిక్స్ డిపాజిట్ చేసారు. అట్టి డిపాజిట్ పత్రాలను మృతుడు లక్ష్మణ్ కూతురుకు ఎస్ఎస్సి బ్యాచ్ స్నేహితులు అందజేసి మనోధైర్యాన్ని నింపారు. లక్ష్మణ్ కుటుంబానికి వీలైన సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటామని వారు చెప్పారు. పూర్వ విద్యార్థులు తమలో ఎవరికైనా ఆపద ఉన్న కుటుంబాలకు మనోధైర్యాన్ని అందిస్తూ వీలైనంత సహకారం సహాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ బ్యాచ్ విద్యార్థులను అన్ని పార్టీల నాయకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, జర్నలిస్టులు ప్రత్యేకంగా అభినందించారు.

మాజీ మంత్రి అవినీతి, అక్రమాలపై విచారణ చేపిస్తాం

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

నియోజకవర్గంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన అవినీతి, అక్రమాలు బయటకు తీస్తామని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ నియోజకవర్గ పోలింగ్ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పదేండ్ల బీఆర్ఎస్ పాలనంలో పేదలను భయపెట్టి వారి భూములను బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించారని, వాటిపై విచారణ జరిపి, పేదలకు భూములను పంచుతామని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ మంత్రిగా జిల్లాకు జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు.తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో 400 కేవీ, 220 కేవీ,132 కేవీ సబ్‌స్టేషన్‌లను తీసుకొచ్చానని తెలిపారు.33 కేవీసబ్‌స్టేషన్‌లను 14 మంజూరు చేశానని గుర్తు చేశారు.తర్వాత అధికారంలోకి వచ్చిన జగదీశ్‌రెడ్డి వాటిని ఆయన చేసిన అభివృద్ధి గా చెప్పుకున్నారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఎస్సారెస్పీ రెండో దశ పూర్తి చేసి సూర్యాపేటకు గోదావరి జలాలు తీసుకుని వస్తే ఆ తర్వాత ఆ నీళ్లకు జగదీశ్‌రెడ్డి పసుపు, కుంకుమచల్లి పూజలు చేశారన్నారు.ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న జానారెడ్డిని ఒప్పించి పాలేరు జలాలు సూర్యాపేటకు తీసుకురావడానికి కాలువలు తవ్వితే వాటిని బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకంగా ప్రచారం చేసుకున్నారని తెలిపారు. తన పాలనలో సూర్యాపేటలో విశాలమైన ప్రదేశంలో నూతన వ్యవసాయ మార్కెట్ నిర్మాణం చేశానని తెలిపారు.ఐదు నెలల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తనకు టిక్కెట్ ఆలస్యంగా రావడం వలన సమయం లేకపోవడం వలన ప్రణాళిక ప్రకారం ప్రచారం చేయలేక పోయానని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేశారని అన్నారు. పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి అత్యధిక మెజారిటీ తీసుకొస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో నియోజకవర్గం నుండి మొత్తం 2,44,116 మంది ఓటర్లకు గాను 1,78,378 మంది ఓటింగ్ లో పాల్గొన్నారని, మొత్తం ఓట్లలో 73శాతం మంది ఓట్లు వేశారని గతంలో కంటే ఎక్కువగా పోలింగ్ జరిగిందన్నారు.ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకునివాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి,పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు,టీపీసీసీ ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, నాయకులు గోదాల రంగారెడ్డి, పోతుభాస్కర్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, చింతమల్ల రమేశ్, వీరన్ననాయక్, కోతిగోపాల్‌రెడ్డి, కొండపల్లి దిలీప్‌రెడ్డి, అబ్దుల్ రహీం, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ తోట దగ్ధం



నవతెలంగాణ-ఆలేరు టౌన్

మండల పరిధిలోని కొలనుపాక గ్రామంలో మంగళవారం గోపి శ్రీనివాస్ రెడ్డి అనే రైతుకు చెందిన 12 ఎకరాల ఫామ్ ఆయిల్ తోట ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధమైంది. రైతు గోపి శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫామ్ ఆయిల్ తోటలో అనుకోకుండా మంటలు చెలరేగి డ్రిప్పు పైపులు, తోట పూర్తిగా ఖాళీ బూడిదైనాయి. సుమారు 70 లక్షల విలువైన నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలని ఆర్పారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మామిడాల అంజయ్య మాట్లాడుతూ రైతు గోపి శ్రీనివాస్ రెడ్డిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్ల పరిశీలన

నవ తెలంగాణ- నకిరేకల్

ఈనెల 19, 20 తేదీలలో మండలంలోని నెల్లిబండ గ్రామంలో జరిగే శ్రీ లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుట్టపైకి వెళ్లి ఉన్న సౌకర్యాలను పరిశీలించి అదనంగా కావలసిన సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆలయ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు యానాల శేఖర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సూర్యాపేట

పట్టణంలోని ఎస్వీ కాలేజీలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమత్తు కారణంగా బుధవారం ఉదయం 08.00 నుండి 09.00 వరకు టూటౌన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇందిరమ్మ కాలనీ మొదటి విడత,ఎన్టీఆర్‌కాలనీ, చంద్రన్నకుంట,తాళ్లగడ్డ, ప్రియాంకకాలనీ, సీతారాంపురం, నాగులమ్మగుడి, మామిళ్లగడ్డ, ముత్యాలమ్మ గుడి దగ్గర,ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ, ఆర్‌కె.గార్డెన్, జనగాం ఎక్స్‌రోడ్, భాషానాయక్‌తండా, సదాశివారెడ్డి ఫంక్షన్‌హాల్ దగ్గర,ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ వెనకాల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ప్రజలంతా సహకరించాలని కోరారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకురాలు సాయమ్మ మృతి

నవతెలంగాణ-నూతనకల్



మండల పరిధిలోని చేపకుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కూసు సాయమ్మ అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మరణించింది. మంగళవారం సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి మృతురాలి మృతదేహంపై ఎర్రజెండాను కప్పేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళు లర్పించారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ(ఎం) మండల నాయకులు అలిపురం సంజీవరెడ్డి బొజ్జ శ్రీను అంజేపెల్లి లక్ష్మయ్య తొట్ల లింగయ్య ముండ్ల సంజీవ గజ్జల సాయి రెడ్డి కట్ట సత్యనారాయణ రెడ్డి కట్ట నర్సిరెడ్డి ఎల్లవుల నరేష్ ఉప్పుల వెంకన్న జటంగి లింగయ్య రాంబాబు తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ పోలింగ్ హుషారు... నేతల్లో గుబులు

- క్రాస్ షఉటింగ్ ఎవరి కొంపముంచుతుందో..?
- భారీగా పోలైన 77 శాతం..ఓటింగ్
- తగ్గిన మహిళలు ఓట్లు.... యువత ఆసక్తి

నవ తెలంగాణ-నార్కట్ పల్లి



లోక్ సభ ఎన్నికల లో భాగంగా సోమవారం జరిగిన బోనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోగల నకిరేకల్ నియోజకవర్గంలోభారీగా పోలింగ్ నమోదయింది. నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా 2 లక్షా 53 వేల 470 మంది ఓటర్లు ఉండగా లక్షా 950620 మంది ఓట్లను వినియోగించుకున్నారు. 311 పోలింగ్ కేంద్రాలలో 77 శాతం ఓటింగ్ శాతం నమోదయింది.. .నియోజకవర్గంలో గతంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉండేవి అని ఓటర్ల సంఖ్య కనుగుణంగా మరో ఆరు కేంద్రాలను పెంచారు . పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 311 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం ఏడు గంటలకు ఎన్నికలు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు ఎన్నిక కొనసాగింది. గతంలో ఐదు గంటల వరకు ఎన్నికలు జరిగే వి. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ మరో గంట ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో భారీగా పోలింగ్ నమోదు కావడంతో ఓటర్లు ఎవరు వైపు మొగ్గ చూపాలని ప్రధాన పార్టీ నేతల్లో గుబులు మొదలైంది.

క్రాస్ ఓటింగ్ ఎవరి కొంపముంచుతుందో..

సుమారు రెండు నెలల పాటు పార్లమెంట్ ఎన్నిక ప్రక్రియ కొనసాగినప్పటికీ ప్రధాన పార్టీలు తమ తమ శైలిలో ప్రచారం నిర్వహించుకొని పోలింగ్ నాటికి తాము ఓటర్లను ప్రభావం చూపలేకపోయారు తమ పార్టీలపై ఓటర్లు నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపిస్తారో లేదో అని అనుమానం పార్టీ కింది శ్రేణుల్లో గుబులు పుట్టించి తాము గెలవకున్న తమ ప్రత్యర్థి పార్టీ గెలవద్దని భావించారో ఏమో? గ్రామాల్లో రాష్ట్రంలో ఉన్న ప్రధాన పార్టీ నాయకులు మరో జాతీయ పార్టీకి మద్దతు తెలిపే విధంగా వారితో కూర్చొని వారి ఓట్లను బదిలాయించినట్లు పుకార్లు వినబడుతున్నాయి. ప్రత్యర్థికి మెజార్టీ రాకుండా ఉండడమే కాకుండా అసలు ఆ పార్టీని ఓడగొడితే తమ సత్తా ఏంటో తెలుస్తుందని అనుకున్నట్లు గుసగుసలు వినబడుతున్నాయి. భారీ మెజార్టీతో గెలుస్తామన్న ధీమాతో ఉన్న పార్టీలకు క్రాస్ ఓటింగ్ కొంప ముంచుతుందేమోనన్న భయం పట్టుకుందని ప్రతి నలుగురు కలిసిన చోట చర్చ కొనసాగుతుంది.

ఎన్నికల సరళి ఇలా...

నకరికల్లు నియోజకవర్గం లో ఆరు మండలాల్లో జరిగిన ఎన్నికల్లో ఉదయం 9 గంటల వరకు. రామన్నపేట10.08 చిట్యాల 10.89 నార్కట్ పల్లి 10.76 కట్టంగూర్ 12.10, నకిరేకల్ 10.50, కేతేపల్లి 11. 16, మొత్తం 10.86% ఓటింగ్ నమోదయింది. ఉదయం 11 గంటలకు 29 . 34శాతం ఓటింగ్ నమోదయింది. మధ్యాహ్నం ఒంటిగంటకు 47. 41శాతం ఓటింగ్ నమోదు అయింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు పురుషులు ఒక లక్ష 25 వేల 451 మంది, మహిళలు 1,28, 330 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు అదేవిధంగా ఇతరులు నలుగురు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 61.54శాతంకు చేరింది. సాయంత్రం ఐదు గంటల వరకు రామన్నపేట పురుషులు 1,68 5 8 మహిళలు 1,69 23 మొత్తం33281.7429, శాతం చిట్యాల పురుషులు1 7 4 8 7, మహిళలు 17700 మొత్తం 35 187, నార్కట్ పల్లి. పురుషులు 15780, మహిళలు 15803 73.21శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. కట్టంగూరు 13683,, మహిళలు13456 27139 మంది ఓటర్లు 72.94 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. నకిరేకల్ పురుషులు 1 7 2 9 2, మహిళలు 17259, మొత్తం 34 53 3మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేతేపల్లి 1 0 7 4 8 పురుషులు 1 0 9 9 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు 72.34శాతం పోలింగ్ నమోదయింది .నియోజకవర్గం లో 72.34శాతం ఓటింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల వరకు రామన్నపేటలో మొత్తం 44,800 గాను 33,281 ఓట్లు నమోదు అయ్యాయి. చిట్యాల లో 47, 502 ఓట్ల గాను 35,187 ఓట్లు నమోదు అయ్యాయి. నార్కట్ పల్లి లో 43 9 ఓట్ల గాను 31,583 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల వేడికి.. వేసవి తాపం హుష్...

అసలే ఎండాకాలం ఆపై మే నెల కావడం తో వేసవి తాపం ఎన్నికలపై ప్రభావం చూపుతాయని అధికారులు భయపడ్డారు. ఈ తర హాలో సాయంత్రం గంటసేపు ఓటింగ్ వేసి సమయాన్ని పెంచారు. కానీ వేసవి కాలానికి భిన్నంగా ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉంటూ ఎన్నికల వేడికి వేసవి తాపం హుష్ అంది. పోలింగ్ శాతం కూడా పెరిగింది.

తగ్గిన మహిళల ఓట్లు .. యువత ఆసక్తి..

నియోజకవర్గంలో మొత్తం 2 53, 785 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,25 451, మంది, ఓటర్లు మహిళా ఓటర్లు 1,28, 330 మంది ఉన్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన పోలింగ్ లో 96, 808 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నమోదైన పోలింగ్ లో పురుషుల కంటే మహిళా ఓటింగ్ పోలిస్తే సుమారు 2000 తేడా ఉంది. యువత ఓటు హక్కును వినియోగించడంలో ఆసక్తి చూపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- 10 నుండి 14 సీట్లు పగెలవబోతున్నాం
- ప్రజల గౌరవాన్ని కాపాడే విధంగా రాజకీయాలు చేద్దాం
- గాదరి కిషోర్ వి చిల్లర మాటలు
- కుందూరు రఘువీర్ రెడ్డి

నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్




పార్లమెంటు ఎన్నికల్లో నల్గొండ పార్లమెంట్ పరిధిలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. రాష్ట్రంలో పది నుంచి 14 పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ గెలుస్తుందని నల్గొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నల్గొండ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసిన జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్, పార్టీ నాయకులకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన ప్రజలకు, యువత, మహిళలందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.పార్లమెంట్ ఎన్నికల్లోకాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేందుకు జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రభుత్వం సహకారంతో కృషి చేస్తానన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ 10 నుంచి 14 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుంటుందని దేశంలో కూడా ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు.ప్రచార సమయంలో తనపై ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ తో పాటు ఆ పార్టీ నాయకులు ఆరోపణలు చేసే సమయంలో గౌరవంగా ప్రజల గౌరవాన్ని కాపాడే విధంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వ్యాపారి అని తనపై ఆరోపణలు చేయడంలో అర్థం లేదని ఇలాంటి వ్యాఖ్యలతో ప్రజల్లో చులకన కాక తప్పదన్నారు. ప్రజల గౌరవాన్ని కాపాడుకునే విధంగా రాజకీయాలు ఉండాలని, నిర్ణయాత్మకంగా మాట్లాడుకొని ప్రజల సంక్షేమంతో పాటు జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి సలహాలిస్తే ప్రభుత్వం స్వీకరిస్తుందన్నారు.బురద జల్లే ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. సమావేశంలో నల్గొండ పట్టణ పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, బైరు ప్రసాద్, జూలకంటి సైదిరెడ్డి, పెండెం పాండయ్య, గాలి నాగరాజు, గాదరి రవి, ఏడుదొడ్ల వెంకటరామిరెడ్డి, బొజ్జ శంకరయ్య తదితరులు ఉన్నారు.

ఓటర్ లిస్ట్‌లో మాయా జాలం

- ఒకటే వార్డులో ఒక్కరికే రెండు ఓట్లు
- బూత్‌లు వేరు...వార్డు ఒక్కటే
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- పైగా ఫిర్యాదు దారులను గెంటిన పోలీసులు
- అంగన్ వాడి టీచర్ నిర్వాకం

నవతెలంగాణ -నల్లగొండ టౌన్



ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో ఓటర్ల నమోదు లో మాయాజాలం బయట పడింది .నల్లగొండ పురపాలక సంఘం పరిధిలో ఈ ఎపిసోడ్ వెలుగు చూసింది.ఒకటే వార్డులో వేర్వేరు బూత్ లలో ఓటు నమోదు చేసుకోవడం తో పాటు ఉదయం ఒక బూత్ లో సాయంత్రం ఒక బూత్ లో సదరు ఓటరు ఓటు హక్కు వినియోగించుకున్న అధికారులు నోరు మెదపక పోవడం గమనార్హం. పైగా ఇదే విషయాన్ని గుర్తించిన వార్డు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేక పోయింది. పైగా ఈ ఓటు విషయంలో రగడ జరుగుతుందని తెలుసుకున్న అధికార పార్టీ నేతలు మూకుమ్మడిగా అక్కడికి చేరుకుని వాగ్వివాదానికి దిగడంతో పాటు బలవంతంగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలను పోలీసుల సహకారంతో బయటికి గెంటి వేశారు.పోలింగ్ రోజు ఉదయం 41 వ వార్డు పరిధిలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 137(విశ్వదీప్ స్కూల్)లో ఓటు హక్కును వినియోగించుకున్న సదరు ఓటరు సాయంత్రం పూట అదే వార్డు పరిధిలోని పోలింగ్ స్టేషన్ 176 (విశ్వదీప్ స్కూల్)లో వేసింది. వాస్తవానికి ఓటర్ల డుప్లికేషన్ ను ఇల్లు ఇల్లు తిరుగుతూ చెక్ చేసు కోవాల్సిన బాధ్యత ఆ ఏరియా బిఎల్ఓ ది. అయితే ఆమె భర్త అధికార కాంగ్రెస్ పార్టీకి చెంది ఉండడంతో అధికారులు ఉదాసీనంగా ఉండి పోయారు.అయితే ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న విపక్ష బీఆర్ఎస్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చెయ్యడం తో పాటు మిగితా వార్డులలో ఇటువంటి ఉదంతాలు చోటు చేసుకున్నాయా అన్నది పరిశీలిస్తున్నారు.ఈ విషయంలో విచారణ జరిపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTIRCT AND SESSIONS JUDGE:: YADADRI BHONGIR :: AT BHONGIR
G.W.O.P.No. 8 OF 2024

Between:
1.Sadharu @ Swathirola Rajesh
2.Sadharu @ Swathirola Prema
....Petitioners
AND
To whom so it may concern
....Respondent
To:
To whom so it may concern

NOTICE

Please take notice that the above case is filed by the petitioners to declare / Appoint the petitioner No.2 as Guardian of Person and Property of the minor Petitioner No.1 namely Sadharu @ Swathirola Rajesh S/o.Narsimha and also to sell the Agrl. land bearing Sy.No.295/AA/2 admg Ac.2-23 Gts and Sy.No.296/AA/2 admg Ac.0-34 Gts total admg Ac.3-17 Gts, situated at Palliwada (V), Ramannapet (M), Y.B.Dist., bounded by: North: Rachakalva, South:Land of Chakali Narsimha, East:Land of S.Muthaiah& Others at present Petitioner No.2, West: Land of Boddu Dharmaiah, to the third parties by the petitioner No.2 and the said matter is posted on 07-06-2024 for appearance of any interested party. If any interested party fails to appear on 07-06-2024 at 10:30 A.M. before the above said Hon'ble court either in person or through an Advocate, the matter will be decided in exparte as per law.

//BY ORDER OF THE HON'BLE COURT//
BOBBALA KESHAVA REDDY
ADVOCATE:BHONGIR
(COUNSEL FOR THE PETITIONERS)
CELL No.9966383083.
Bhongir
Date:14-05-2024.

PUBLIC NOTICE

All the public in general are hereby informed that one **Smt. Kusunoju Padma,W/o.Nagabhushanam, R/o. Suryapet** proposing to mortgage his/her owned schedule property in faovur of **Shriram Finance Ltd., Suryapet Branch** towards collateral security for obtaining loan. If anybody has got any objection or claim / charge over the schedule property may approach the below mentioned office within one week with authenticated documents in support of their claim, otherwise my client would proceed to sanction the loan.

SCHEDULE OF THE PROPERTY

Residential house bearing door No. 3-5-131/1/C/15 to an extent of 130.40 Sq.Yards equivalent to 109.03 Sq.Meters having RCC Plinth area 309.75 Sft and A.C. Sheet plinth area 365.06 Sft in Sy.No. 39 of B.Madharam Revenue Village situated at Jammigadda, Behind Lions Eye Hospital, within the limits of Suryapet Municipality, Suryapet District and bounded by :-
North : House of Sridevi
South : House of Maibu Khan
East : House of Chennoju Satyanarayana
West : 30 Feet Road

M.ESHWAR KUMAR
B.Com.,(Hon's.) LL.B.
Advocate & Notary
Suryapet,Cell:9848198660.

PUBLIC NOTICE

All the public in general are hereby informed that one **Sri Tank Jawahar Singh, S/o.Gurumukh Singh, R/o. Suryapet** proposing to mortgage his / her owned schedule property in faovur of **Shriram Finance Ltd., Suryapet Branch** towards collateral security for obtaining loan. If anybody has got any objection or claim / charge over the schedule property may approach the below mentioned office within one week with authenticated documents in support of their claim, otherwise my client would proceed to sanction the loan.

SCHEDULE OF THE PROPERTY

Plot No. 16/2 (Part) to an extent of 22 Sq. Yards and Plot No. 16/1 (Part) to an extent of 22 Sq. Yards total 44 Sq. Yards equivalent to 36.78 Sq.Meters in Sy.Nos. 355, 356 and 357 of Suryapet Revenue Village situated at Ward No.3, Block No.12, Yerukalawada, within the limits of Suryapet Municipality, Suryapet District and bounded by :-
North: Plot No. 15 of Chennaiah
South: 25 Feet Road
East: Plot No.16/1 Part and Plot No. 16/2 Part of Udugu Nagamani
West: Plot No. 16/1 Part and Plot No.16/2 Part.

M.ESHWAR KUMAR
B.Com.,(Hon's.) LL.B.
Advocate & Notary
Suryapet,Cell:9848198660.

PUBLIC NOTICE

All the public in general are hereby informed that one **Smt. Mondikathi Vijaya Laxmi,W/o. Venkateshwarlu, R/o. Beebigudem** proposing to mortgage his / her owned schedule property in faovur of **Shriram Finance Ltd., Suryapet Branch** towards collateral security for obtaining loan. If anybody has got any objection or claim / charge over the schedule property may approach the below mentioned office within one week with authenticated documents in support of their claim, otherwise my client would proceed to sanction the loan.

SCHEDULE OF THE PROPERTY

Residential house bearing door No. 3-41 (PTIN No. 1043100214) to an extent of 288 Sq.Yards equivalent to 240.80 Sq.Meters having ACC Plinth area 806 Sft situated at Beebigudem, within the limits of Suryapet Municipality, Suryapet District and bounded by :-
North: House of Padidala Yallamma
South: 18 Feet Road
East: Houses of Gaddala Vijaya and Ramaiah
West: House of Kodi Ramesh.

M.ESHWAR KUMAR
B.Com.,(Hon's.) LL.B.
Advocate & Notary
Suryapet,Cell:9848198660.

IN THE COURT OF THE 1st ADDL.JUNIOR CIVIL JUDGE AT NALGONDA
O.S.NO.135 OF 2024.

BETWEEN:
Bandaru Bharathi W/o Late Laxmi Narayana,Age: 61 years, Occ: Household R/o.H.No.15-03-350, Gowliguda Chaman, Gowliguda, Nampally, Hyderabad.
...Plaintiff
AND
1.The Sub-Registrar Nalgonda
2.Whom so ever it may concern
...Defendants
To
Whom so ever it may concern

Take notice that the above named Plaintiff filed the suit for declaration of legal heir of deceased Bandaru Faninder who was died on 06.01.2020 the above suit O.S. No. 135 of 2024 stands posted to 05.06.2024 for appearance, and if anybody has may any objections they appear either in person or through Advocate at 10.00 A.M. on dated 05/06/2024 and filed objections.

// BY ORDR OF THE COURT //
B.VENKATESHAM
THOTA SHEKHAR M.A.LL.B
Advocates,Nalgonda.
Cell:9948630621.



కోర్టు భవన నిర్మాణపనులు వేగవంతం చేయాలని వినతి

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలో నూతన కోర్టు భవన నిర్మాణపనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిలకు పలువురు న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పట్టణంలో గతంలో 2 కోర్టులు వుండగా, మరో రెండు కోర్టులు ఏర్పాటు చేశారన్నారు.దీంతో మొత్తం 4 కోర్టులు పని చేస్తున్నాయని తెలిపారు. కోదాడలో 5 కోర్టుల భవన నిర్మాణానికి గత ఫిబ్రవరి22న శంకుస్థాపన జరిగిందని, నిర్మాణపనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదని వారి దృష్టికి తీసుకొచ్చారు.దీనికి స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిర్మాణపనులపై దృష్టి సారించి, పనులు వేగవంతమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ న్యాయవాదులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మేకల వెంకట్రావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకుంట్లరామిరెడ్డి, న్యాయవాదులు ఈదులకృష్ణయ్య, చల్లాకొండలరెడ్డి, ముల్కవెంకట్‌రెడ్డి, కేఎల్ఎన్.ప్రసాద్, బండి వీరభద్రం తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ- హాలియా

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అనాథ వ్యక్తి కట్ల సాయికి కంటి చూపు ,కాళ్ల పక్షవాతం రావడంతో అది తెలుసుకున్న దాతృత ఫౌండేషన్ సభ్యులు రూ.5000 ఆర్థిక సహాయం మంగళవారం చేశారు. ఈ కార్యక్రమంలో దాతృత ఫౌండేషన్ నల్గొండ ప్రెసిడెంట్ కాంసాని వెంకట్ రెడ్డి,చలమల్ల వెంకటరెడ్డి, పాతనబోయిన సురేష్, అలుగుల కృష్ణారెడ్డి, మారుపాక మల్లికార్జున గౌడ్, అయితగోని సతీష్, అనుముల ప్రశాంత్, సుబ్బు, సైదులు, అనిల్, రాకేష్, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బ్రహ్మంగారి కళ్యాణం

నవతెలంగాణ- హాలియా

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీమద్వి విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 21వ వార్షికోత్సవ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.భక్తులతో పోటెత్తిన దేవాలయం పూజా కార్యక్రమం అనం తరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ 21 ఏండ్ల నుండి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు చిట్టిపోలు వెంకన్న, అలుగుల బ్రహ్మానందరెడ్డి,పంగ వెంకటేశ్వర్లు, పాతనబోయిన సురేష్, పిల్లి శ్రీను, కృష్ణమాచారి, మేకల పరమేశ, లింగయ్య,పంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు



నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ- దేవరకొండ

దేవరకొండ నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నిక ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం మాలుగడ్డ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో నాయి బ్రాహ్మణ సంఘ గౌరవాధ్యక్షులు కామోజు విజయ్ సలహాదారులు కుడిదాల కృష్ణయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేశారు. నాయి బ్రాహ్మణ సంఘ అధ్యక్షులుగా నేలపట్ల వాసుదేవ్, ఉపాధ్యక్షులుగా జాజాల తిరుపతయ్య,గోలి మల్లయ్య,ప్రధాన కార్యదర్శి కానుగుల మధు,కోశాధికారి వెలిజాల సురేష్, కార్యదర్శులు గోలి శీను, కుడిదాల ప్రశాంత్ ఎన్నుకున్నారు. అధ్యక్షుడు నేలపట్ల వాసుదేవ్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడి ఎన్నుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ సంఘ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.